





Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS

irspublications12@gmail.com



సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 145 | బుధవారం 10 డిసెంబర్ 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


# అన్ని రంగాల్లోనూ నిరంతర అభివృద్ధి

- 2047 డాక్యుమెంట్‌లో ముఖ్యాంశాలు
- కోర్... ప్యూర్.. రేర్ పేరుతో మూడు కారిడార్‌లుగా విభజన
- 3 ట్రిలియన్ డాలర్ల వృద్ధి లక్ష్యం
- రాష్ట్ర భవిష్యత్‌ను నిర్దేశించే రోడ్ మ్యాప్



హైదరాబాద్-సూర్య వాస్తవం, డిసెంబర్ 9

అన్ని రంగాల్లో అన్‌స్టాపబుల్ అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం "తెలంగాణ రైజింగ్ 2047" డాక్యుమెంట్‌ను రూపొందించింది. రాబోయే రెండు దశాబ్దాల్లో రాష్ట్రాన్ని సమగ్రంగా, సమ్మిళిత, సుస్థిర భవిష్యత్‌కు విదాన పత్రం బాటలు వేయనుంది.

- మిగతా 2లో..



## ఈసీని అడ్డం పెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

- లోక్‌సభలో రాహుల్ గాంధీ
- ఈసీని బీజేపీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందన్న రాహుల్
- ఓట్ల చోరీపై ఆధారాలు ఇచ్చినా ఈసీ స్పందించలేదని ఆరోపణ
- ఓటర్ల జాబితాల్లో భారీగా అవకతవకలు జరుగుతున్నాయని విమర్శ
- దేశంలోని వ్యవస్థలను ఆర్‌ఎస్‌ఎస్ కబ్జా చేస్తోందని వ్యాఖ్య

న్యూఢిల్లీ-సూర్య వాస్తవం, డిసెంబర్ 9

ఎన్నికల కమిషన్ (ఈసీ)ను అడ్డం పెట్టుకుని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తోందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. మంగళవారం లోక్‌సభలో ఎన్నికల సంస్కరణలపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ..

- మిగతా 2లో..

# స్క్రబ్ టైఫస్‌పై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్...

- కట్టడికి సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు
- రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ వ్యాప్తిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- అధ్యయనం కోసం జాతీయ స్థాయి నిపుణులతో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుకు సీఎం ఆదేశం
- రాష్ట్రంలో 1,592 స్క్రబ్ టైఫస్ కేసులు, చిత్తూరులో అత్యధికం
- సీజనల్ వ్యాధులు 48 శాతం తగ్గుముఖం పట్టాయని తెలిపిన అధికారులు
- అపరిశుభ్రతే అసలు జబ్బని, ప్రజల్లో చైతన్యం పెంచాలని సీఎం సూచన



అమరావతి-సూర్య వాస్తవం, డిసెంబర్ 9

రాష్ట్రంలో ఆందోళన కలిగిస్తున్న స్క్రబ్ టైఫస్ వ్యాధి నియంత్రణకు, దానిపై సమగ్ర అధ్యయనం చేసేందుకు జాతీయ స్థాయి వైద్య నిపుణులతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అపరిశుభ్రతే అనేక వ్యాధులకు మూలకారణమని, ప్రజల్లో పరిశుభ్రతపై విస్తృత చైతన్యం తీసుకురావడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో వైద్యారోగ్య శాఖ

- మిగతా 2లో..




## బీఎల్‌ఓలకు బెదిరింపులు...

- ఎస్ఐఆర్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రతి రాష్ట్రంలో కొనసాగాల్సిందేనన్న సుప్రీంకోర్టు
- అధికారులకు బెదిరింపులు రావడాన్ని తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు
- బీఎల్‌ఓలు ఒత్తిడికి గురైతే వారి స్థానంలో వేరే వారిని తీసుకోవడం వంటి మార్గాలు చూడాలని సూచన

న్యూఢిల్లీ-సూర్య వాస్తవం, డిసెంబర్ 9

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ప్రతి రాష్ట్రం తప్పనిసరిగా

- మిగతా 2లో..



## ప్రధాని మోదీని కలిసిన టెక్ దిగ్గజ సంస్థల సీఈఓలు...

- భారత్‌లో విస్తరణకు సిద్ధమైన గ్లోబల్ కంపెనీలు
- భారత్‌లో 17.5 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనున్నట్టు ప్రకటించిన మైక్రోసాఫ్ట్
- సెమీకండక్టర్ల తయారీ కోసం టాటా గ్రూప్‌తో చేతులు కలిపిన ఇంటెల్
- దేశంలోని వర్ధమాన నగరాల్లో విస్తరణకు సిద్ధమైన కాగ్నిజెంట్
- ఏఐ, సెమీకండక్టర్ల రంగంలో భారత్‌కు పెట్టుబడుల వెల్లువ

2లో



## నెహ్రూ అసలైన విశ్వాస పాత్రుడైతే... సిసలైన విశ్వాస ఘాతకుడు మోదీనే

- నెహ్రూపై మోదీ వ్యాఖ్యలను ఖండించిన షర్మిల
- మోదీ ఓ అభినవ బ్రిటీషర్ అంటూ తీవ్ర వ్యాఖ్యలు
- స్వాతంత్ర్య పోరాటంలో బీజేపీ పూర్వీకుల పాత్రేమిటని ప్రశ్న
- దెయ్యాలు వేదాలు వల్లించినట్లు మోదీ మాటలున్నాయని ఎద్దేవా

అమరావతి-సూర్య వాస్తవం, డిసెంబర్ 9

ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశ తొలి

- మిగతా 2లో..


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి


# కారుణ్య నియామకాల నిబంధనలు ఉల్లంఘన...?

- నిబంధనలు ఉల్లంఘించి ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు....!
- నకిలీ ధృవీకరణ తో మరికొందరు...?
- ప్రభుత్వానికి లక్షల్లో నష్టం
- సర్వీసు రూల్స్ అతిక్రమించి రెగ్యులరైజేషన్, ప్రొబేషన్
- సర్వీసు రికార్డులు తారుమారు
- విచారణపై చర్యలకు ముఖం దాటేసిన అధికారి....!




అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం

అనంతపురం జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి పరిధిలో భారీ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి .డి సి హెచ్ ఎస్ పరిధిలో పనిచేసే మినిస్టీరియల్ సిబ్బందిలో కొంతమంది కారుణ్య నియామకాలు ద్వారా నియామకం అయ్యారు. కారుణ్య నియామకాలు సవరణ చట్టం ప్రకారం డేట్ ఆఫ్ జాయిన్ సమయం లో నియమాలతో కూడిన ఆర్డర్ ను జారీ చేస్తారు. నిరీ?త సమయంలో ఇచ్చిన కండిషన్స్ పూర్తి చేసిన వారికి ప్రభుత్వ బెనిఫిట్స్ మరియు తదితర అంశాలపై లబ్ధి చేకూరేలా నియమాలు ఉన్నాయి. ఇవన్నీ ఉల్లంఘించి ఇచ్చిన కండిషన్స్ పూర్తి కాకుండా కొంత మంది ఉద్యోగులు నకిలీ సర్టిఫికేట్ తో మరియు తప్పుడు ధ ృవీకరణ తో డేట్ ఆఫ్ జాయిన్ నుండి సర్వీసు ధృవీకరించుకొని ఇంక్రిమెంట్లు ప్రమోషన్లు ఇతర బెనిఫిట్స్ పొందడం జరిగింది.

ప్రభుత్వ సేవలకు వారధిగా పనిచేసే మినిస్టీరియల్ సిబ్బంది ఈ స్థాయిలో ప్రభుత్వం ను మోసం చేయడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. వీరిలో కొందరివి నకిలీ సర్టిఫికేట్ లు అని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వీరిలో జిల్లాలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ మరియు జిల్లా ప్రధాన కార్యాలయం లో పనిచేస్తున్న మినిస్టీరియల్ ఉద్యోగి మరియు ఇతర సిబ్బంది కారుణ్య నియామకాలు ద్వారా నియామకం అయిన ఉద్యోగులు ఉన్నట్లు సమాచారం. గతంలో రోస్టర్ పాయింట్లు మార్చి ఉద్యోగాలు అమ్ముకున్న ఆరోపణలు కూడా ఉన్నాయి.రాష్ట్ర డి ఎస్ హెచ్ డైరెక్టర్ వీరిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి....

మరిన్ని ఆధారాలతో త్వరలో పాఠకుల ముందుకు మరో కథనం .

## ప్రధాని మోదీని కలిసిన
# టెక్ దిగ్గజ సంస్థల సీఈఓలు...

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచ టెక్ దిగ్గజాలైన మైక్రోసాఫ్ట్, ఇంటెల్, కాగ్నిజెంట్ సంస్థలు భారత్‌లో తమ కార్యకలాపాలను భారీగా విస్తరించేందుకు ముందుకొచ్చాయి. మంగళవారం ఆయా సంస్థల ముఖ్య కార్యనిర్వహణాధికారులు (సీఈఓలు) ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమై, దేశంలో భారీ పెట్టుబడులు పెట్టనున్నట్లు హామీ ఇచ్చారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సెమీకండక్టర్ల తయారీ రంగాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు తెలిపారు. మరోవైపు, ఇంటెల్ సీఈఓ లిప్-బు టాన్ కూడా ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. భారత్ సెమీకండక్టర్ల తయారీ, డిజైనింగ్ విధానాలను ఆయన ప్రశంసించారు. 'ఇండియా సెమీకండక్టర్ మిషన్'కు తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ క్రమంలో టాటా గ్రూప్‌తో ఇంటెల్ ఒక కీలక ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. దీని ప్రకారం టాటా ఎలక్ట్రానిక్స్ ఫ్యాబ్, ఓశాట్ కేంద్రాల్లో ఇంటెల్ డిజైన్ చేసిన ఉత్పత్తులను తయారు చేసి, ప్యాకేజింగ్ చేస్తారు.

అదేవిధంగా, కాగ్నిజెంట్ సీఈఓ రవికుమార్ ఎస్ సైతం ప్రధానితో సమావేశమయ్యారు. తమ సంస్థ భారత్‌లోని వర్ధమాన నగరాల్లో (%వఎవతీస్త్రఅఅస్త్ర ఎ౯అవం%) విస్తరించేందుకు కట్టుబడి ఉందని ఆయన హామీ ఇచ్చారు. తద్వారా సమాన అభివృద్ధి, నైపుణ్య వృద్ధికి దోహదపడతామని తెలిపారు. ఏఐ వినియోగాన్ని వేగవంతం చేయడం, విద్య, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలపై ప్రధానితో చర్చించినట్లు కాగ్నిజెంట్ పేర్కొంది. మైక్రోసాఫ్ట్ ఛైర్మన్, సీఈఓ సత్య నాదెళ్ల ప్రధానితో సమావేశం అనంతరం కీలక ప్రకటన చేశారు. ఆసియాలోనే తమ సంస్థ పెట్టే అతిపెద్ద పెట్టుబడిగా, రాబోయే నాలుగేళ్లలో (2026-2029) భారత్‌లో 17.5 బిలియన్ డాలర్లను ఇన్వెస్ట్ చేయనున్నట్లు వెల్లడించారు.

## బీఎల్ఓలకు
# బెదిరింపులు...

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగించాల్సిందేనని భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలు ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో, ఆ సవరణను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు నేడు విచారణ జరిపింది. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ నిర్వహణలో ఎదురవుతోన్న పరిస్థితులను పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు.

పిటిషన్లపై విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. బెంగాల్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగమైన బీఎల్ఓ (బూత్ లెవల్ అధికారులు), ఇతర అధికారులకు బెదిరింపులు వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ ఘటనలను తీవ్రంగా పరిగణిస్తున్నామని, వీటిని తమ దృష్టికి తీసుకురావాలని లేకపోతే గందరగోళ పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. బీఎల్ఓలకు బెదిరింపులు వస్తే, ఎస్ఐఆర్ ప్రక్రియలో అంతరాయాలు ఏర్పడితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, వారి భద్రతకు సంబంధించి తగిన ఆదేశాలు జారీ చేస్తామని స్పష్టం చేసింది.

బీఎల్ఓలు ఒత్తిడికి గురైతే వారి స్థానంలో వేరే వారిని తీసుకోవడం వంటి పరిష్కార మార్గాలను అనుసరించాలని సూచించింది. ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రక్రియ నిర్వహణలో ఎటువంటి అవాంతరాలు ఏర్పడినా అధికారులను రక్షించడానికి పోలీసుల సహకారం తీసుకుంటున్నామని ఎన్నికల సంఘం కోర్టుకు తెలియజేసింది.

## ఈసీని అడ్డం పెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని
# ఖూనీ చేస్తున్నారు

(మొదటి పేజీ తరువాయి)

ఈసీ స్వతంత్రతను దెబ్బతీస్తున్నారని, పక్షపాతంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) తప్పు చేసినా శిక్ష పడకుండా చట్టాలను మార్చారని రాహుల్ విమర్శించారు. ఓట్ల దొంగతనంపై తాము ఎన్నో ఆధారాలు సమర్పించినా ఈసీ నుంచి కనీస స్పందన కరువైందని మండిపడ్డారు. బీజేపీకి అనుకూలంగానే ఎన్నికల షెడ్యూళ్లను ప్రకటిస్తున్నారని, పోలింగ్ ముగిసిన 45 రోజుల తర్వాత సీసీటీవీ ఫుటేజీని ధ్వంసం చేయాలనే నిబంధన ఎందుకని ఆయన ప్రశ్నించారు. హర్యానా ఓటర్ల జాబితాలో బ్రెజిల్‌కు చెందిన ఒక మోడల్‌కు 23 ఓట్లు ఉన్న విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఓటర్ల జాబితాలను ఎలా తారుమారు చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చని అన్నారు.

ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి రాహుల్ గాంధీ మూడు కీలక ప్రశ్నలు సంధించారు.

1. సీఈసీ స్వయంప్రతిపత్తి ఎందుకు బలహీనపడుతోంది? దాని స్వతంత్రతను నిర్ధారించే యంత్రాంగాలను ప్రభుత్వం పునరుద్ధరిస్తుందా?
2. ఎస్ఐఆర్ ప్రక్రియలపై అనేక రాష్ట్రాల నుంచి ఫిర్యాదులు అందుతున్న సమయంలో, ఓటర్ల జాబితాలను తారుమారు చేయకుండా నిరోధించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?
3. ఈసీ నియామకాలు, నిర్ణయాలు రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఎందుకు కనిపిస్తున్నాయి? ఈ విషయంలో పారదర్శక సంస్కరణలు చేపట్టడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందా?... అని ప్రశ్నించారు.

## ఏపీకి 8 మంది
# ఐఏఎస్‌ల కేటాయింపు

**అమరావతి - సూర్య వాస్తవం, డిసెంబర్ 9**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిపాలనను బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2024 బ్యాచ్‌కు చెందిన 8 మంది ఐఏఎస్ అధికారులను ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు కేటాయిస్తూ కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ (%ణశీ౹%) ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అధికారికంగా లేఖ ద్వారా సమాచారం అందించింది. దేశవ్యాప్తంగా ఈ బ్యాచ్‌లో మొత్తం 179 మంది ఐఏఎస్‌లుగా ఎంపిక కాగా, వారిలో 8 మందిని ఏపీకి కేటాయించారు. రాష్ట్రంలో పరిపాలనను మరింత వేగవంతం చేసి, ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు ఈ కొత్త అధికారులు దోహదపడనున్నారు. త్వరలోనే వీరంతా రాష్ట్ర ప్రభుత్వంలో విధుల్లో చేరనున్నారు.

## అన్ని రంగాల్లోనూ
# నిరంతర అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2047 ముగింపు సభలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించారు నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల అభిప్రాయాలు, ఆకాంక్షలకు ఇందులో చోటు కల్పించారు. దీని తయారీలో నిటి ఆయోగ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రొఫెసర్లు పాలుపంచుకున్నారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను వృద్ధి చేయడమే ప్రధాన విజన్‌గా రూపొందించారు. అదునాతన సాంకేతికత, కొత్త ఆవిష్కరణలు, సమర్థవంతమైన ఆర్థిక వనరులతో పాటు సుపరిపాలన ఈ ఆర్థిక వృద్ధికి దోహదంగా పని చేస్తాయని ఇందులో పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధికి కోర్, ప్యూర్, రేర్ అనే మూడు-జోన్ల నమూనాను కీలకంగా ప్రస్తావించారు. హైదరాబాద్ సిటీతో పాటు పరిసర ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల మధ్య సమతుల్య, పరస్పర ఆధారిత వృద్ధిని సాధించాలని నిర్ణయించారు. 2047 నాటికి జాతీయ జీడీపీలో తెలంగాణ వాటా పదో వంతుకు చేరాలని లక్ష్యమని పేర్కొన్నారు. పెట్టుబడులకు గమ్యస్థానంగా, ఆవిష్కరణలకు కేంద్రంగా తెలంగాణను ప్రపంచ స్థాయి మౌలిక వసతులున్న అత్యాధునిక రాష్ట్రంగా తీర్చిదిద్దటం, అన్ని వర్గాలకు సమాన గౌరవం, సమాన అవకాశాలు కల్పించే ఆదర్శవంతమైన రాష్ట్రంగా నిలబెట్టడాన్ని ప్రస్తావించారు.

### ఆర్థిక, సమ్మిళిత, సుస్థిర అభివృద్ధి

2047 లక్ష్య సాధనకు మూడు సూత్రాలను ఇందులో ప్రతిపాదించారు. 1. ఆర్థిక వృద్ధి ఆవిష్కరణలు, ఉత్పాదకత ఆధారిత వృద్ధి ద్వారా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించడం. 2. యువత, మహిళలు, రైతులు, అణగారిన వర్గాలతో సహా సమాజంలోని అన్ని వర్గాలకు వృద్ధి ఫలాలు అందేలా సమ్మిళిత అభివృద్ధి 3. అన్ని రంగాల్లో సుస్థిరతను పొందుపర్చడం, 2047 నాటికి నెట్-జీరో ఉద్గారాల లక్ష్యాన్ని సాధించాలని నిర్ణయించారు. సాంకేతికత, ఆవిష్క రణలు, పరిశ్రమలు సేవల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞా నాన్ని ఉపయోగిస్తారు, పెట్టుబడులను ఆకర్షించడానికి, ప్రాజెక్టులకు నిధులు సమకూర్చడానికి వినూత్న ఆర్థిక నమూనాలను రూపొందించనున్నారు. అబివృద్ధి, సంక్షేమం తో పాటు అన్ని రంగాల్లో సుపరిపాలన, పారదర్శక, జవాబుదారీ తనాన్ని అందించాలని ప్రతిపాదించారు.

### లక్ష్య సాధనకు మూడంచెల వ్యూహం

తెలంగాణ భౌగోళిక ప్రాంతాన్ని మూడు విభిన్న, రంగాల వారీగా ఇందులో విభజించారు. ఈ విధానం సమతుల్య ప్రాంతీయ అభివృద్ధికి పునాదులు వేస్తుంది.

1)కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ: 160 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్(ఓఆర్ఆర్) లోపల ఉన్న హైదరాబాద్ సిటీ ప్రాంతం. సేవల విస్తరణకు ప్రాధాన్యం, నెట్-జీరో సిటీగా అభివృద్ధి చెందుతుంది. ఇది ప్రపంచ స్థాయి నాలెడ్జ్, ఆవిష్కరణల కేంద్రంగా వృద్ధి చెందుతుంది.

2). అర్బన్ రీజియన్ ఎకానమీ: ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్), 360 కిలోమీటర్ల ప్రాంతీయ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) మధ్య ఉన్న జోన్‌గా నిర్ణయించారు. ఇది భవిష్యత్‌లో తయారీ రంగానికి కేంద్రంగా ఉంటుంది. ఇక్కడ పారిశ్రామిక క్లస్టర్లు, లాజిస్టిక్స్ హబ్‌లు పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తారు. ఫలితంగా శరవేగంగా అభివృద్ధి చెందుతుంది.

3).రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ: ప్రాంతీయ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) దాటి, రాష్ట్ర సరిహద్దుల వరకు విస్తరించి ఉన్న ప్రాంతంగా దీన్ని నిర్ణయించారు. వ్యవసాయం, హరిత ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలకు ధీటుగా వృద్ధి చెందుతందని డాక్యుమెంట్‌లో ప్రస్తావించారు.

### పది కీలక వ్యూహాలు

2047 దార్శనికతను సాధించడానికి 10 కీలక వ్యూహాలను డాక్యుమెంట్‌లో ప్రస్తావించారు.

**3-జోన్ల రాష్ట్రం** : సమతుల్య అభివృద్ధికి క్యూర్, ప్యూర్, రేర్ నమూనా.

**విచక్షణ నుంచి విధానానికి** : పెట్టుబడుల ఆకర్షణ, పాలనలో పారదర్శకత. విధానపరమైన నిర్ణయాలను ప్రోత్సహించడం.

**గేమ్-ఛేంజర్ ప్రాజెక్టులు** : భారత్ ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవనం, డ్రై పోర్ట్, బందర్ పోర్ట్ వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే, రీజినల్ రింగ్ రోడ్. రింగ్ రైలు, బుల్లెట్ రైలు, కారిడార్ల వంటి ప్రాజెక్టులు.

**సమర్థపాలన** : డిజిటల్ గవర్నమెంట్, టీ ఫైబర్, స్పీడ్ వంటి కార్యక్రమాలతో పాలనా సామర్థ్యాన్ని పెంచడం.

**నాలెడ్జ్ హబ్** : ప్రపంచ స్థాయి విద్య, పరిశోధన సంస్థలను ఆకర్షించడం.

**సుస్థిర సంక్షేమం** : మహిళలు, రైతులు, యువతపై ప్రత్యేక దృష్టి. ఆరోగ్యం, విద్య, జీవనోపాధి అందరికీ సమాన అవకాశాలు.

**అభివృద్ధి నిధులు** : మౌలిక సదుపాయాల ప్రాజెక్ట్‌ల్లో ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించి ప్రత్యేక నిధి ఏర్పాటు చేయడం.

పర్యావరణం, సుస్థిరత వాతావరణ మార్పులతో వాటిల్లే నష్టాలను తగ్గించడం.

**సంస్కృతి** : రాష్ట్ర సాంస్కృతిక వారసత్వమైన, కళలు, పర్యాటకాన్ని పరిరక్షించడం, ప్రోత్సహించడం.

ప్రజల యొక్క, ప్రజల కోసం, ప్రజల చేత అనే విధానం ద్వారా పాలనలో పౌరుల భాగస్వామ్యాన్ని నిర్ధారించాలని ప్రతిపాదించారు.

# స్క్రబ్ టైఫస్‌పై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్...

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు.

రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ వ్యాధి తీవ్రతపై అధికారులు ముఖ్యమంత్రికి వివరాలు అందించారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 1,592 స్క్రబ్ టైఫస్ కేసులు నమోదయ్యాయని, అత్యధికంగా చిత్తూరు జిల్లాలో 420 కేసులు ఉన్నాయని తెలిపారు. అయితే, ఈ వ్యాధి కారణంగానే మరణాలు సంభవించినట్లు ఇప్పటివరకు ఎక్కడా నిర్ధారణ కాలేదని అధికారులుస్పష్టం చేశారు. అనుమానిత మరణాలుగా నమోదైన 9 కేసులను పరిశీలించగా, ఇతర ఆరోగ్య సమస్యలు, మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ కారణంగానే వారు మరణించినట్లు తేలిందని వివరించారు.

స్క్రబ్ టైఫస్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామని, ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య బృందాలతో పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే కేసుల సంఖ్యలో ఆంధ్రప్రదేశ్ 8వ స్థానంలో ఉందని, తమిళనాడు, ఒడిశాలలో ఏకంగా 7 వేలకు పైగా కేసులు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. ఈ నివేదికపై స్పందించిన ముఖ్యమంత్రి, స్క్రబ్ టైఫస్‌ను తేలికగా తీసుకోవద్దని హెచ్చరించారు. తక్షణమే జాతీయ, అంతర్జాతీయ నిపుణులతో ఒక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి, వ్యాధి వ్యాప్తికి గల కారణాలను విశ్లేషించి, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని సూచించారు. ఆ నివేదిక ఆధారంగా పటిష్ఠమైన కార్యాచరణ అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు.

### సీజనల్ వ్యాధులు 48 శాతం తగ్గుముఖం

గత ఏడాదితో పోలిస్తే రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు గణనీయంగా తగ్గుముఖం పట్టాయని అధికారులు సమావేశంలో వెల్లడించారు. ప్రభుత్వం చేపట్టిన ముందస్తు జాగ్రత్త చర్యలు, పారిశుధ్య కార్యక్రమాలు, ప్రజల్లో అవగాహన పెంచడం వంటి కారణాలతో మొత్తం సీజనల్ వ్యాధులు 48 శాతం తగ్గాయని తెలిపారు. ముఖ్యంగా డెంగ్యూ కేసులు 56 శాతం, చికున్‌గున్యా 46.5 శాతం, మలేరియా 11 శాతం మేర తగ్గాయని వివరించారు. పరిశుభ్రతను పెంచడం ద్వారా సీజనల్ వ్యాధులను సున్నా స్థాయికి తీసుకురావాలని సీఎం చంద్రబాబు లక్ష్యంగా నిర్దేశించారు. సమాజంలో అతిపెద్ద జబ్బు అపరిశుభ్రతేనని, దానిపై యుద్ధం ప్రకటించాలని పిలుపునిచ్చారు.

ఈ సమీక్షా సమావేశంలో వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్, కమిషనర్ వీరపాండ్యన్, ఎన్టీఆర్ వైద్యసేవ సీఈవో దినేష్ కుమార్, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ గిరీశా తదితరులు పాల్గొన్నారు.

## నెహ్రూ అసలైన విశ్వాస పాత్రుడైతే...
# సిసలైన విశ్వాస ఘాతకుడు మోదీనే

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూపై మోదీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని, ఇది స్వాతంత్ర్య ఉద్యమాన్ని, సమరయోధులను అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెహ్రూ ఈ దేశానికి అసలైన విశ్వాసపాత్రుడైతే, మోదీ సిసలైన విశ్వాస ఘాతకుడని ఘాటుగా విమర్శించారు. స్వాతంత్ర్యం కోసం 12 ఏళ్లు జైలు జీవితం గడిపిన నెహ్రూను, అదే స్వాతంత్ర్య ఫలాలతో 12 ఏళ్లుగా అధికారంలో ఉంటూ రాజభోగాలు అనుభవిస్తున్న మోదీ విమర్శించడం సిగ్గుచేటని షర్మిల అన్నారు. ప్రధాని హోదాలో పార్లమెంట్ సాక్షిగా మోదీ మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని, ఆయన మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని ఎద్దేవా చేశారు.

ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నేతల పాత్రను ఆమె ప్రశ్నించారు. "స్వాతంత్ర్య ఉద్యమంలో బీజేపీ పాత తరం నేతలు ఎక్కడున్నారు? మత ఛాందసవాదులు ఎప్పుడైనా 'వందేమాతరం' అన్నారా? ఆర్ఎస్ఎస్ జాతీయ పతాకానికి సెల్యూట్ చేసిందా? 2002 వరకు ఆర్ఎస్ఎస్ కేంద్ర కార్యాలయంపై జాతీయ జెండా ఎందుకు ఎగరలేదు?" అని షర్మిల నిలదీశారు. వివిధ వ్యవస్థలపై బీజేపీ అజమాయిషీ నుంచి ప్రజల దృష్టిని మళ్లి ంచేందుకే నెహ్రూను దోషిగా చిత్రీకరించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. 'విభజించు - పాలించు' సిద్ధాంతంతో మోదీ ఓ అభినవ బ్రిటీషర్‌లా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. జాతీయ గీతాన్ని, వందేమాతరం స్ఫూర్తిని ఈ దేశంలో నిలబెట్టింది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని షర్మిల స్పష్టం చేశారు.

## పీఆర్, ఆర్డీ ఉద్యోగులతో
# నేడు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ భేటీ

**- మంగళగిరిలో 'మాటామంతీ' కార్యక్రమం ఏర్పాటు**
**- అవినీతి రహిత పాలనపై ఉద్యోగులకు దిశానిర్దేశం**
**- గ్రామీణ సేవల మెరుగుకు సలహాలు స్వీకరించనున్న పవన్**

**అమరావతి - సూర్య వాస్తవం**

ఏపీ ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఉద్యోగులతో నేరుగా చర్చించేందుకు సిద్ధమయ్యారు. నేడు బుధవారం మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో పంచాయతీరాజ్ (పీఆర్), గ్రామీణాభివృద్ధి (ఆర్డీ) శాఖల ఉద్యోగులతో 'మాటామంతీ' కార్యక్రమం నిర్వహించనున్నారు. గ్రామ స్థాయిలో అవినీతికి తావులేని, పారదర్శకమైన పాలన అందించేందుకు ఉద్యోగులంతా సహకరించాలని ఈ సమావేశంలో ఆయన కోరనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీరాజ్ శాఖలో సుమారు 10 వేల మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా, గ్రామీణాభివృద్ధి శాఖలోని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సైతం పదోన్నతులు, వేతనాల పెంపుతో పాటు ఇతర సంక్షేమ ప్రయోజనాలు అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

నూతన సంవత్సర కానుకగా సంక్రాంతి నాటికి ఈ ప్రయోజనాలను వారికి అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సానుకూల పరిణామాల నేపథ్యంలో పవన్ కల్యాణ్ నిర్వహిస్తున్న ఈ సమావేశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ భేటీలో అన్ని కేడర్ల ఉద్యోగులతో పవన్ స్వయంగా మాట్లాడి, గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ఎలాంటి విధానాలు అవలంబించాలనే దానిపై వారి అభిప్రాయాలు, సలహాలు తీసుకోనున్నారు. క్షేత్రస్థాయిలో పాలనను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి.

## సంపాదకీయం

# రుణాల రద్దు ఎన్నాళ్లు... ఎన్నేళ్లు





ఈ మధ్య కాలంలో బ్యాంకులు తరచుగా వార్తల్లోకొస్తున్నాయి. హెడ్‌లైన్స్‌గా మారుతున్నాయి. దానికి ముఖ్యమైన కారణం.. మొండి బకాయిలు. బ్యాంకింగ్ భాషలో ఎన్‌పీఏ.. నాన్ పెర్ఫార్మింగ్ అసెట్స్ అంటారు. ఈ వారం లబ్ డబ్బులో ఎన్‌పీఏ గురించి తెలుసుకుందాం.బ్యాంకులు అనేక విధాలుగా లోన్లు ఇస్తూ ఉంటాయి. పెద్ద మొత్తంలో లోన్లు తీసుకుని అవి ఎగొట్టి కొందరు, బకాయిలు తీర్చే స్థోమత లేక కొందరు... ఇలా చాలామంది బ్యాంకులకు మోత మోగిస్తున్నారు. వీటినే మొండి బకాయిలు అంటారు. అయితే రిజర్వు బ్యాంకు చెబుతున్న దాని ప్రకారం బ్యాంకులకు తామిచ్చిన రుణాలకు వాయిదాలు తిరిగి రాకపోతే వాటిని ఎన్‌పీఏ అంటారు.2008 సెప్టెంబర్‌లో భారతదేశంలో మొండి బకాయిల విలువ రూ. 53,917 కోట్లు ఉండగా పది సంవత్సరాలకు.. అంటే 2018 నాటికి రూ. 8,40,958 కోట్లకు అమాంతం పెరిగిపోయింది.ఏకంగా ఎనిమిది లక్షల కోట్ల రూపాయలు. దేశంలోని 21 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఇదీ పరిస్థితి. ఇంత డబ్బు ఉంటే దేశంలో ఉన్న రైతులకు చాలా వరకు రుణ మాఫీ చేసేయొచ్చు. తాగునీటికి కటకటా అంటున్న ప్రజలకు ప్రతి రోజూ మంచి నీరు సరఫరా చేయొచ్చు.సామాన్యుల ఊహకు కూడా అందనంత అప్పులు తీసుకుని వాటిని ఎగ్గొట్టేసి ఏ విదేశాలకో వెళ్లి సెటిల్ అయిపోతే బ్యాంకులు మాత్రం ఏం చేస్తాయి లెండి! ఎవరైనా ఏ లక్ష రూపాయలో లోన్ తీసుకుని నిజంగానే డబ్బు లేక వాయిదాలు కట్టలేకపోతే వాళ్ల మీద మాత్రం బ్యాంకులు తమ ప్రతాపం చూపిస్తాయి!!బ్యాంకుల మొండి బకాయిలకు ముఖ్య కారణం పరిశ్రమలు. ఇంతకుముందు నేను చెప్పినట్టు కొంతమంది బడా పారిశ్రామికవేత్తలు బ్యాంకుల నుంచి లోన్లు తీసుకుని తుర్రుమన్నారు. ఇక స్టీల్ కంపెనీలు నష్టాల్లో ఉండడంతో వారి నుంచి కూడా తిరిగి ఆ డబ్బు రావట్లేదు. వ్యవసాయ రంగం, సేవల రంగం కూడా బ్యాంకులను మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్నాయి.దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకులు కీలక నిర్ణయం తీసుకున్నాయి. గత అయిదున్నరేళ్లలో ఏకంగా రూ. 6.15 లక్షల కోట్ల మేర రుణాల్ని రైటాఫ్ చేశాయి. సాంకేతికంగా రద్దు చేశాయని చెప్పొచ్చు.

ఈ మేరకు పార్లమెంటులో.. కేంద్ర మంత్రి పంకజ్ చౌధరి వెల్లడించారు. అయితే ఇది రుణమాఫీ కాదని.. బకాయిల వసూలు ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేశారు. 5 ఆర్థిక సంవత్సరాలు సహా ఈ ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ వరకు.. అంటే మొత్తంగా అయిదున్నర సంవత్సరాల్లో ప్రభుత్వ రంగ బ్యాంకులు లక్షల కోట్ల మేర రుణాల్ని సాంకేతికంగా రద్దు చేశాయి. అంటే లోన్ రైటాఫ్ చేశాయన్నమాట. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి ఈ విషయాల్ని పార్లమెంటులో వెల్లడించారు. ఏకంగా రూ. 6,15,647 కోట్లు లేదా రూ. 6.15 లక్షల కోట్ల రుణాల్ని రైటాఫ్ చేసినట్లు తెలిపారు. రుణాల రైటాఫ్ రుణ మాఫీ కిందికి రాదని.. ఇది ఆర్థిక పరమైన ప్రక్రియ మాత్రమేనని మంత్రి పేర్కొన్నారు.సాధారణంగా రైటాఫ్ అంటే.. ఆర్బీఐ మార్గదర్శకాలు, బ్యాంక్ బోర్డులు ఆమోదించిన విధానాల ప్రకారం.. నిరర్థక ఆస్తులుగా మారిన నాలుగేళ్లకు.. పూర్తి కేటాయింపులు చేసినటువంటి రుణాల్ని బ్యాంకులు తమ బ్యాలెన్స్ షీట్ నుంచి తొలగించేందుకు ఇలా రైటాఫ్ చేస్తాయి. మరో సులభ భాషలో చెప్పాలంటే.. బ్యాంక్ లేదా ఆర్థిక సంస్థ ఏదైనా.. బకాయి ఉన్న లోన్‌ను తిరిగి వసూలు చేయడం దాదాపు అసాధ్యం అని నిర్ధరించినప్పుడు.. ఆ లోన్ మొత్తాన్ని తమ అకౌంటింగ్ పుస్తకాల నుంచి అధికారికంగా తొలగిస్తుంది.లోన్ రైటాఫ్ అంటే సదరు రుణ గ్రహీతకు మాఫీ ఇచ్చినట్లు కాదు. ఇప్పటికీ సదరు రుణ గ్రహీత తిరిగి చెల్లించాల్సిన బాధ్యత ఉంటుంది. బ్యాంకులు తమ బ్యాలెన్స్ షీట్‌ను క్లియర్‌గా ఉంచుకునేందుకు.. మొండి బకాయిల భారం తగ్గించుకునేందుకు ఈ చర్య చేపడతాయని చెప్పొచ్చు. రైటాఫ్ చేసినప్పటికీ.. రుణ గ్రహీత క్రెడిట్ స్కోరుపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఇది భవిష్యత్తులో వారికి లోన్లు అందకుండా అడ్డుకుంటుంది.ఇదే విషయాన్ని కేంద్ర మంత్రి వెల్లడించారు. రైటాఫ్ చేసినప్పటికీ.. బ్యాంకులు రుణాల వసూలు ప్రక్రియ కొనసాగిస్తాయని.. ఇక్కడ రుణ వసూలు ట్రైబ్యునల్స్, నేషనల్ లా కంపెనీ ట్రైబ్యునల్ వంటి చట్టపర మార్గాల ద్వారా.. లోన్ రికవరీ ఏజెంట్ల ద్వారా ఆ మొత్తాన్ని రాబట్టుకునేందుకు ప్రయత్నిస్తాయని పంకజ్ చౌధరి పేర్కొన్నారు. ఇక గత ఐదు సంవత్సరాలలో చూస్తే.. రైటాఫ్ చేసిన రుణాల నుంచి ప్రభుత్వ రంగ బ్యాంకులు కేవలం రూ. 1.65 లక్షల కోట్లను మాత్రమే రికవరీ చేసుకోగలిగాయి.పెద్ద మొత్తంలో లోన్ రైటాఫ్ చేసినప్పటికీ.. ప్రభుత్వ రంగ బ్యాంకుల ఆర్థిక పరిస్థితి మెరుగ్గానే ఉందని.. ఇటీవలి కాలంలో మరింత మెరుగైందని కేంద్ర మంత్రి వెల్లడించారు. 2022-23 ఆర్థిక సంవత్సరం నుంచి ప్రభుత్వ బ్యాంకులకు.. ప్రభుత్వం ఎలాంటి మూలధన సాయం అందించలేదని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఆ బ్యాంకులు తమ మూధన అవసరాల్ని తీర్చుకునేందుకు మార్కెట్ సహా ఇతర వనరులపై ఆధారపడుతున్నాయన్నారు. ఈక్విటీ, బాండ్లను జారీ చేయడం ద్వారా ప్రభుత్వ బ్యాంకులు 2022-25 మధ్య కాలంలో రూ. 1.79 లక్షల కోట్లను సమీకరించినట్లు తెలిపారు.

బ్యాంకింగ్ మోసాల్లో మోసగాళ్లు రూ. 3,588.22 కోట్లు కొల్లగొట్టగా.. రూ. 238 కోట్లు వసూలైనట్లు మంత్రి వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థలో మొండి బకాయిలు 2.3 శాతం వరకు పెరిగే వీలున్నదని ప్రముఖ భారతీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా తాజాగా అంచనా వేసింది. నిజానికి బ్యాంకుల ఎన్‌పీఏలు గత కొన్నేండ్లుగా క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్రా అంచనా ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్న దిప్పుడు. 2021 నుంచి 2025 వరకు ప్రభుత్వ రంగ బ్యాంకుల ఎన్‌పీఏలు 9.11 శాతం నుంచి 2.58 శాతానికి తగ్గుముఖం పట్టాయి. ఈ క్రమంలో ఇవి మళ్లీ బాగానే పెరగవచ్చని ఇక్రా అంటున్నది.ఈ ఆర్థిక సంవత్సరం బ్యాంక్ రుణ వృద్ధి 10.7 శాతం నుంచి 11.5 శాతానికి పెరగొచ్చని ఇక్రా అంచనా వేస్తున్నది. వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) సంస్కరణలు, పండుగ సీజన్ కలిసొచ్చి క్రెడిట్‌కు డిమాండ్ ఏర్పడిందని చెప్తున్నది. ఆర్బీఐ ద్రవ్యసమీక్షలో తీసుకున్న నిర్ణయాలతో బ్యాంకింగ్ వ్యవస్థలోకి అదనపు నిధులు రావడం కూడా రుణాల వృద్ధికి దోహదం చేసే అంశమేనని పేర్కొన్నది. కాగా, రిటైల్, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్‌ఎంఈ)ల నుంచి రుణాలకు డిమాండ్ ఉంటున్నదని చెప్పింది.


# నేడు అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం




ప్రతి మనిషి మనిషిగా జీవించడానికి కొన్ని హక్కులు ఉండాలి. ఇందులో జాతి, భాష, కుల, మతాలకతీతంగా మనిషిగా జీవించే హక్కు కలిగి ఉండడమే ప్రధాన ఉద్దేశ్యం.అలాంటి మానవ హక్కుల దినాన్ని 10 డిసెంబర్ 1948న ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. అప్పటినుండి ప్రతిసంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా డిసెంబరు 10వ తేదీ ని అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవంగా జరుపుకుంటున్నారు. వివక్షత లేనటువంటి మానవ సమాజ నిర్మాణమే ఈ అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవ లక్ష్యం. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం డిసెంబరు 10న ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏట నిర్వహిస్తారు. ఐదేళ్ళకోసారి అమెరికా సంయుక్త రాష్ట్రాలు మానవ హక్కులకు సంబంధించినవారికి ఇచ్చే పురస్కారం, అలేగా అత్యున్నత నోబెల్ బహుమతి అందుకున్న వారిని ఈరోజున సత్కరిస్తారు. 1948, డిసెంబరు 10న ఐక్యరాజ్య సమితి విశ్వమానవ హక్కుల ప్రకటన చేసింది. అందువల్ల డిసెంబర్ 10వ తేదీని అంతర్జాతీయ మానవహక్కుల దినంగా ప్రపంచ వ్యాప్తంగా జరుపుకొంటారు. మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించడంకోసం కోర్టులతోపాటు మానవ హక్కుల కమిషన్లు ఏర్పాటుచేయబడ్డాయి. భారత దేశంలో ..క్రీ.శ.1215లో ఇంగ్లండ్ అప్పటి రాజు జాన్ విడుదల చేసిన 'మాగ్నా కార్టా' మొట్టమొదటి మానవ హక్కుల ప్రకటన నుండే భారత రాజ్యాంగం లోని ప్రాథమిక హక్కులు రూపొందాయి. 1993లో రూపొందిన మానవ హక్కుల పరిరక్షణ చట్టం 1994, జనవరి 8నుండి అమలులోకి వచ్చింది.

# నోబెల్ బహుమతి వ్యవస్థాపకుడు, స్వీడిష్ రసాయన శాస్త్రవేత్త ఆల్‌ఫ్రెడ్ నోబెల్

- నేడు ఆయన వర్ధంతి
- నోబెల్ పురస్కారం ఈయన పేరుమీదన స్థాపించబడింది



ఆల్‌ఫ్రెడ్ బెర్నార్డ్ స్వీడిష్ రసాయన శాస్త్రవేత్త, ఇంజనీరు, ఆవిష్కారకుడు, మిలిటరీ ఆయుధాల తయారీదారు, డైనమైట్ ఆవిష్కర్తకుడు. ఒక పాత ఇనుము, స్టీల్ మిల్లును తీసుకొని బొఫోర్స్ అనే మిలిటరీ ఆయుధాలను తయారు చేసే కంపెనీ స్థాపించాడు. ఈయన ఆఖరి వీలునామాలో నోబెల్ బహుమతి స్థాపన కొరకు చాలా పెద్ద మొత్తంలో ధనాన్ని కూడగట్టాడు. కృత్రిమ మూలకము నోబెలియం ఇతని పేరు మీదుగా నామకరణం చేసారు. ఆల్‌ఫ్రెడ్ నోబెల్ మూడవ సంతానం. ఈయన స్వీడన్ దేశంలోని స్టాక్‌హోంలో అక్టోబర్ 21 1833లో జన్మించాడు.ల్ఫ్రెడ్ తండ్రి ఇమాన్యుయేల్ ఇంజనీరు. తరువాత ఇతని కుటుంబంతో 1842లో సెయింట్ పీటర్స్‌బర్గ్ చేరుకున్నాడు.ల్ఫ్రెడ్ రసాయన శాస్త్ర అధ్యయనం ప్రొఫెసర్ నికోలాయ్ నికోలెవిచ్ జినిన్ వద్ద ప్రారంభించాడు. నేడు భౌతిక, రసాయన, వైద్య, శాంతి విభాగం శాస్త్రాలలోనే కాకుండా... సాహిత్యం, శాంతి రంగాల్లో విశేష కృషి చేసిన వారికి అందిస్తున్న ప్రపంచ ప్రఖ్యాత నోబెల్ పురస్కారం ఈయన పేరుమీదన స్థాపించబడింది. డిసెంబర్ 10, 1896, సన్రెమో, ఇటలీలో మరణించారు. ఆల్‌ఫ్రెడ్ నోబెల్ 1895 నాటి వీలునామా ప్రకారం 1901లో ఈ పురస్కారం ప్రారంభించబడింది (నోబెల్ మరణించిన 5 సంవత్సరాల తరువాత).

ఆల్‌ఫ్రెడ్ నోబెల్ గౌరవార్థం ఆర్థిక బహుమతి మటుకు 1969 నుండి బ్యాంక్ ఆఫ్ స్వీడన్ ద్వారా ఇవ్వడం జరుగుతోంది. నోబెల్ శాంతి బహుమతి ను మాత్రము నార్వే రాజధానీ ఓస్లో లో ప్రదానం చెస్తారు ఈ ఆరు బహుమతులు అత్యధిక పారితోషికంతో పాటు పేరు ప్రఖ్యాతలకు నిదర్శనం. ప్రతీ సంవత్సరం, ఒక్క శాంతి బహుమానం తప్ప మిగతా ఐదు బహుమతులు నోబెల్ వర్ధంతి అయిన డిసెంబరు 10 నాడు, స్టాక్‌హోంలో ఇవ్వబడతాయి. వివిధ రంగాలలో విశేషమైన కృషి, పరిశోధనలు చేసిన, విప్లవాత్మక విధానాలు, పరికరాలతో శాస్త్రాన్ని ముందంజ వేయించిన, మానవ సమాజానికి ఆ శాస్త్రంతో అత్యంత సహాయాన్ని అందించిన వ్యక్తులకు, సంస్థలకు శాంతి బహుమతి మాత్రమే ఇవ్వబడుతుంది.

# అరటి రైతు ఆత్మహత్య...!

- బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన ఎస్‌వి కేన్ ఆర్గనైజేషన్



**అనంతపురం టౌన్ – సూర్య వాస్తవం, డిసెంబర్ 9:** అనంతపురం జిల్లా పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామానికి చెందిన రైతు చిల్ల నాగ లింగయ్య ఈనెల 4వ తారీఖున ఆత్మహత్య చేసుకోవడం విధితమే. రైతు తనకున్న రెండు ఎకరాల పొలంతో పాటు గ్రామంలోని ఇతర రైతుల పొలాలను కౌలుకు తీసుకొని అరటి పంటాను వేయడం జరిగింది. గత రెండు సంవత్సరాల నుంచి అరటి పంట ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధర లేక పోవడంతో ఆర్థికంగా నష్టపోవడం జరిగింది. పంట అవసరాల కోసం రైతుల దగ్గర తెచ్చిన డబ్బులు రైతులుకు తిరిగి చెల్లించలేక డబ్బులు ఇచ్చిన రైతులకు సమాధానం చెప్పలేక అనుకున్న రెండు ఎకరాల పొలంలోనే ఆత్మహత్య చేసు కోవడంతో పుట్లూరు మండలంలో కలకలం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న ఎస్.వీ.కెన్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ స్టీఫెన్ అనురాగ్, వైస్ ప్రెసిడెంట్ బోయ త్రిభువన్ తేజ మరియు ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం స్టేట్ వైస్ ప్రెసిడెంట్ కేశవ వాల్మీకి, జిల్లా అధ్యక్షులు బోయ మాధవయ్య, జిల్లా యూత్ వింగ్ వైస్ ప్రెసిడెంట్ వీర బ్రహ్మయ్య ఆ గ్రామాన్ని సందర్శించి రైతు కుటుంబానికి 50వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.

# కంపోస్టు యార్డుకు చెత్తను తరలించేందుకు పర్యవేక్షణ



**గుత్తి – సూర్య వాస్తవం, డిసెంబర్ 9:** గుత్తి మున్సిపాలిటీ పరిధిలో గుంత కల్లు రోడ్డు, నెమతాబాదు రోడ్డు పరి సర ప్రాంతములో గల కంపోస్టు యా ర్డుకు మున్సిపాలిటీ పరిధికి సంబంధించిన చెత్తను తరలిం చేందుకు పర్యవేక్షణ చేసిన జిల్లా రెవెన్యూ అధికారి రామకృష్ణారెడ్డి, మున్సిపల్ కమీ షనర్బ.జబ్బార్ మియా,మండల రెవె న్యూ ఇన్స్ పెక్టర్ హనుమాన్ ప్రసాద్, డి.ఈ.ఈ హేమచంద్ర,టి.పి.ఓ మారుతి ప్రసాద్, శానిటరీ ఇన్స్ పెక్టర్ మహ బూబ్ బాషా,ఏ.ఈ గోవిందప్ప, మున్సిపల్ సర్వేవర్ దినేష్ రెడ్డి, టి.పి.బి. ఓ అప్ప స్వామి, వి.ఆర్.ఓ సురేంద్ర, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నా రు.

# ఖాళీల భర్తీకి సెలవు రోజుల్లోనూ దరఖాస్తుల స్వీకరణ

- ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ చల్లా లలిత



**అనంతపురం టౌన్ – సూర్య వాస్తవం, డిసెంబర్ 9:** అనంత పురం బుడ్డప్పనగర్‌లోని శిశుగృహలో ఖాళీల భర్తీకి సంబం ధించి అర్హులైన అభ్యర్థుల నుంచి రెండో శనివారం, ఆదివారం కూడా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఐసీడీఎస్ ఇంచార్జ్ పీడీ చల్లా లలిత మంగళవారం తెలిపారు. మిషన్ వాత్సల్య పథకం కింద నిర్వహిస్తున్న శిశు గృహలో కాంట్రాక్టు, పార్ట్ టైం ఉద్యోగాల భర్తీకి సంబంధించి ఈ నెల 6న నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. 8 నుంచి 14వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు అందులో పేర్కొన్నట్లు వివరించారు. 13, 14న రెండ్రోజులు వరుసగా ప్రభుత్వ సెలవు దినాలు వచ్చాయని, అయినా దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు. దరఖాస్తులను స్వీకరిస్తుంది. అర్హత. ఆసక్తి కలిగిన అభ్యర్థులు పైన తెలిపిన సెలవు రోజుల్లోనూ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు ఇవ్వొచ్చని తెలిపారు.

## ఏడవ రోజు భాగవత సప్తహ పఠనం





**పులివెందుల- సూర్య వాస్తవం, డిసెంబర్ 9:** పులివెందుల రింగ్ రోడ్డు అలవలపాడు రోడ్డు సమీపాన కొలువై ఉన్న శ్రీకృష్ణ మందిరంలో మంగళవారం ఐదవ రోజు విజయవంతంగా కొనసాగుతున్న భాగవత సప్తహ పఠనం భూమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి ఎంఏఎల్‌బి ఆయన తండ్రి సోమేశ్వరరెడ్డి అన్న చంద్ర శేఖర్ రెడ్డి జ్ఞాప కార్థం ఈ 7 రోజుల భాగవత పఠనం ఏర్పాటు చేయడం జరిగింది. 11 గురువారం పూర్ణాహుతి తో పరి సమాప్తం కానున్నది , ఎగువ పల్లి శ్రీ గంగిరెడ్డిఅధ్యక్షతన ఈ కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగుతోంది. భక్తులతో ఆలయ ప్రాంగణం ఆహ్లాద వాతవారనం నెలకొంది. ఈ కార్యక్రమా లకు దాత కూడా ఏర్పాటు చక్కగా ఏర్పాటు చేసారు. అనంతరం అన్నదాన తీర్థ ప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగవత పండితులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### క్షేత్రస్థాయిలో లింగాల బోనాల

## బ్రిడ్జి పనులపై ప్రత్యేక దృష్టి!

**- నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలి**

**- తుంగభద్ర ఛైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి**



**లింగాల- సూర్య వాస్తవం, డిసెంబర్ 9:** పులివెందుల నియోజకవర్గం లింగాల బోనాల బ్రిడ్జి నిర్మాణ పనులను అధికారులతో కలిసి తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ ఛైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జోగిరెడ్డి మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణం రైతులకు, స్థానిక ప్రజలకు ఎంతో కీలకమని, పనుల్లో జాప్యం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని, ఎలాంటి లోపాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పనిచేసి, బ్రిడ్జిని త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్య క్రమంలో లింగాల మండల టీడీపీ టీడీపీ నాయకులు ధనుంజయ నాయుడు పార్నపల్లె ధన తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా వైయస్ భారతి రెడ్డి 49వ జన్మదిన వేడుకలు

**- కేకు స్వీట్లు పంపిణీ చేసిన మాజీ చైర్మన్**



**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 9 :** పులివెందుల పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో మాజీ చైర్మన్ రసూల్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సతీమణి వైయస్ భారతి రెడ్డి 49వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె జన్మదిన కేకును మాజీ చైర్మన్ చిన్నప్ప, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి , దేరంగుల చంద్రమౌళి, మాజీ కౌన్సిలర్ నాగరాజు, ఎస్టి నాయకుడు అంజన్నప్ప, నూరుల్లా, కనకలు కట్ చేసిపంపిణీ చేశారు, అనంతరం తోపుడు బండ్ల వ్యాపారస్తులకు రసూల్ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్ భారతి రెడ్డి నిండు నూరేళ్లు అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో, ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఎస్‌యు అధ్యక్షుడిగా అశోక్ కుమార్ రెడ్డి..

**- రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు విద్యార్థులకు ఇచ్చిన హామీలు సాధన కోసం కృషి చేస్తా**



**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 9:** రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ ఆర్ ఎస్ యు పులివెందుల నియోజవర్గ అధ్యక్షుడిగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ చేతుల మీదుగా అశోక్ కుమార్ రెడ్డిని కండువా వేసి సంఘం లోకి ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్ఎస్యు పులివెందుల నియోజకవర్గ అధ్యక్షుడు అశోక్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నాపై నమ్మకంతో పులివెందుల నియోజకవర్గం బాధ్యతలు నాకు అప్పగించినందుకు రాష్ట్ర నాయకత్వానికి మరియు జిల్లా నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో విద్యారంగ సమస్యల పరిష్కార సాధన కోసం. సంక్షేమ హాస్టల్ లో విద్యార్థులు ఎదుర్కొన్న సమస్యలు పరిష్కార సాధన కోసం. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు విద్యార్థులకు ఇచ్చిన హామీలు సాధన కోసం నా వంతు కృషి చేస్తానని ఆయన విలేకరులకు తెలిపారు.

# అరటి సాగులో ఆకుమచ్చ తెగులు నివారణ చర్యలు

**- ఉద్యాన శాస్త్రవేత్తలు అధికారులు**



**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 9 :** కనంపల్లి, బక్కన్నగారిపల్లి రైతు సేవా కేంద్రం నందు అరటి సాగు చేయుచున్న రైతు సోదరులకు సిగటొక ఆకుమచ్చ తెగులు నివారణ, చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలు మరియు గెలల యాజమాన్యం పై రైతు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అరటి పరిశోధనా స్థానం, కొవ్వూరు సీనియర్ ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్ర కుమార్, ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు పి రవిచంద్ర బాబు పాల్గొనడం జరిగింది. శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ అరటి పంటలో ఎరువులు వేయటం అనేది మొక్కలు నాటిన 20 రోజుల నుండి ప్రారంభించాలని, 7 నెలల వరకు అరటి కి వదల్సిన ఎరువులలో 80శాతం వేసుకోవాలని మిగతా 20శాతం గెల వేసిన తర్వాత వేసుకోవాలని, గెల వేసిన తర్వాత మొక్కకు మనం ఎంత ఎరువులు వేసిన తక్కువ గ తీసుకుంటుందని తెలియజేసారు, అరటి లో మొక్కలు నాటిన తర్వాత రోజుకు 10 లీటర్స్ కి నీరు ఒక మొక్కకు, పెరుగుదళ దశలో 15-20 లీటర్లు నీరు, గెల వేసిన తర్వాత వేసవి కాలం లో చెట్టుకు 25-30 లీటర్లు నీరు అవసరం అవుతుందని తెలియజేశారు. అరటి లో కాయల మీద తామర పురుగుల ఉధృతుని తగ్గించడానికి మొగ్గ మొక్క మీద నిటారుగా ఉన్న దశలో ఇమిడాక్లోప్రిడ్ 0.6 ఎం ఎల్ లీటర్లు నీటికి కలుపుకొని ఒక్కొక్క మొగ్గకు 50-100 మిల్లి లీటర్లు మందు ద్రావణం వెళ్లేలా సూది తో ఇంజక్షన్ వేసుకోవాలని, గెల నాణ్యత పెరిగే దానికి 0:0:50 5 గ్రాములు గెలకు పిచికారి చేసుకోవాలని, గెలలకు తోడుగులు వేసుకోవాలని తెలియజేసారు. సిగటోక ఆకుమచ్చ తెగులు వ్యాపించిన తోటల్లో ఆకులు తక్కువై కాయలు మాగే అవకాశం ఉందని తక్కువ తీక్షణత కలిగిన మందుల నుండి ఎక్కువ తీక్షణత కల మందులను పిచికారి చేసుకోవాలని తెలియజేశారు. అరటి ఆకులపై మచ్చలు కనిపించక ముందు క్లోరోతలోనిల్ 2 జి ఎమ్ / లీటర్ నీటికి కలుపుకొని పిచికారి చేసుకోవాలని, ఆకులపై మచ్చలు కనిపించిన తర్వాత ప్రొపెకోనాజోలు 1 ఎమ్ ఎల్ / లీటర్ నీటికి ం మినరల్ ఆయిల్ 10 ఎమ్ ఎల్/ లీటర్ నీటికి కలుపుకొని పిచికారి చేసుకోవాలి. గెల వేసిన తర్వాత ట్రైఫ్లోక్సి స్ట్రోబిన్ ం టేబుకోనాజోలు 1.4 గ్రాములు లీటర్ నీటికి కలుపుకొని పిచికారి చేసుకోవాలని తెలియజేశారు.

ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు రవిచంద్ర బాబు మాట్లాడుతూ అరటి గెలలకు మొగ్గ ఇంజక్షన్లు మరియు గెలలకు తొడుగులు వేసుకున్నట్లయితే ఉద్యాన శాఖ వారు 50% రాయితీ 25500 ఇస్తారని తెలియజేశారు కాయ నాణ్యతను పెంపొందించుకునే దానికి గెలవేసిన వెంటనే తామర పురుగులను నివారించేందుకు తగిన మందులను పిచికారి చేసుకోవాలని తెలియజేశారు. అనంతరం ఉద్యాన అధికారి మాట్లాడుతు ఇటీవల కురిసిన వర్షాల వలన అరటి పంట లో సిగటోక ఆకు మచ్చ తెగులు ఉధృతి పెరిగే అవకాశం ఉందని అందువలన మందు పిచికారీ చేసిన తరువాత మాత్రమే తెగులు సోకినా ఆకులను కోసివేయాలని, భూమిలోని తేమను చూసుకొని తోటకు నీరు పెట్టాలని తెలియజేసారు. ప్రస్తుతం వర్షాల తర్వాత యూరియా మరియు పోటాష్ లను డ్రిప్ లో పంపించాలని తెలియజేసారు. జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, ఉద్యాన అధికారి పులివెందుల, గ్రామ ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు..



# త్యాగానికి మారుపేరు సోనియా గాంధీ

**- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి**



**వేంపల్లి- సూర్య వాస్తవం, డిసెంబర్ 9 :** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ త్యాగానికి, పెద్దరికానికి, హుందాతనానికి ప్రతిరూపమని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. మంగళవారం వేంపల్లి లో సోనియా గాంధీ 79వ పుట్టినరోజును కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక, లౌకిక, సామ్యవాద పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీకి శ్రీమతి సోనియా గాంధీ 19 సంవత్సరాల పాటు అధ్యక్షత వహించడం గర్వకారణం అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ, శాంతి దూత నెహ్రూ, విప్లవ నేత నేతాజీ, ఉక్కుమనిషి పటేల్, ఉక్కు మహిళ ఇందిరమ్మ ,రైతు నేత సంజీవరెడ్డి లాంటి నాయకులు అధిరోహించిన పదవి కాంగ్రెస్ అధ్యక్ష పదవి అన్నారు. రాయబరేలి, అమేది, బళ్లారి లోక్ సభ నియోజకవర్గాల నుంచి ఆరుసార్లు పార్లమెంటు సభ్యురాలుగా ప్రజల చేత ఎన్నుకోబడ్డారు. కనీస మెజారిటీ 3 లక్షల 90 వేల 179 కాగా గరిష్ట మెజారిటీ ఐదు లక్షల 34,918. ప్రస్తుతం రాజ్యసభ సభ్యురాలు యూపీఏ చైర్ పర్సన్‌గా, నేషనల్ అడ్వైజరీ కమిటీ చైర్పర్సన్‌గా క్రియాశీలక పాత్ర పోషించారు. జాతీయ ఉపాధి హామీ పథకం ,విద్యాహక్కు చట్టం ,సమాచార హక్కు చట్టం ,ఆహార భద్రతా చట్టం సోనియా గాంధీ గారి మానస పథకాలని తులసి రెడ్డి వర్ణించారు. సోనియాగాంధీ కృషి వల్లనే ఐక్యరాజ్యసమితి మహాత్మా గాంధీ పుట్టినరోజు అయిన అక్టోబర్ రెండును అంతర్జాతీయ అహింసా దినంగా ప్రకటించింది. త్యాగానికి మరో పేరు సోనియమ్మ .2004 నుండి 2014 వరకు 10 సంవత్సరాల కాలంలో ప్రధాన మంత్రి పదవిని అధిష్టించే అవకాశం వచ్చినా తీసుకోలేదు. భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు ,నిరాడంబరతకు, హుందాతనానికి , పెద్దరికానికి నిలువెత్తు నిదర్శనం. ప్రపంచంలోనే అత్యంత ప్రభావశీలురలో ఒకరుగా సోనియమ్మ అనేకసార్లు ఫోర్బ్స్ మేగజైన్, న్యూ స్టేట్స్ మ్యాన్ పత్రికలచే ఎంపిక చేయబడింది. సోనియమ్మ జీవితం, జీవన విధానం ,త్యాగశీలత, పెద్దరికం, హుందాతనం ,ప్రతి ఒక్కరికి ఆదర్శం, అనుసరణీయం, మార్గదర్శకం ,స్ఫూర్తిదాయకం అని తులసి రెడ్డి కొనియాడారు.. ఈ కార్యక్రమంలో తులసి రెడ్డి సతీమణి నర్రెడ్డి అలివేలమ్మ, వేంపల్లి మండల శాఖ అధ్యక్షులు రామకృష్ణ, పిసిసి డెలిగేట్ అత్తింజేరి శ్రీనాథ్ ,లింగం సతీష్ ,మనీ ,విజయ్ కుమార్, అమర్నాథ్ రెడ్డి , తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి ,బండారు వెంకటేశు, నాగరాజు, వేమయ్య ,బద్రి ,వినయ్ ,రాఘవ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఓ వరం

**- లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి**





**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 9 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదలకు, ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తున్నారని తుంగభద్ర ప్రాజెక్ట్ హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పులివెందుల టీడీపీ కార్యాలయంలో.. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన మారెడ్డి జోగిరెడ్డి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. నియోజ కవర్గంలోని 34 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 14,76,912 పద్నాలుగు లక్షల డెబ్బై ఆరు వేల తొమ్మిది వందల పన్నెండు రూపాయలు విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జోగిరెడ్డి మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు నాయుడు సహకారంతో, బిటెక్ రవి కృషితో నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సాయం అందుతోందని తెలిపారు.లి అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఈ మొత్తాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యాలయంలో సోనియాగాంధీ 79వ జన్మదిన వేడుకలు



**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 9 :** పులివెందుల పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోనియాగాంధీ 79వ జన్మదిన వేడుకలను పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మూలంరెడ్డి ధ్రువకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు భోనాల ఖాదర్ వల్లి ,పులివెందుల మహిళా అధ్యక్షురాలు బుసిపాటి విజయ, అద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆమె జన్మదిన కేకు కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాల్లో దృడసంకల్పం, ధైర్య వంతమైన నాయకత్వం, ప్రజల పట్ల నిర్విరామ సేవకు ప్రతీకగా నిలిచిన గొప్ప వ్యక్తి సోనియా గాంధీ అన్నారు. కేంద్రంలో ,రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే దేశం బాగుపడుతుంది అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షుడు చంద్ర బాబు, రాయపాటి రాజా, డివి నాగరాజు, డివి విజయేంద్ర, డివి విఘ్నేష్, బాషా, జగంరెడ్డి, బి.రాజా, తదితరులు పాల్గొన్నారు.

## వైయస్ భారతి రెడ్డి జన్మదినాన అంధులకు అన్నదానం

### - పంపిణీ చేసిన మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి



**సింహాద్రిపురం- సూర్య వాస్తవం, డిసెంబర్ 9 :** పులివెందుల పట్టణంలోని శ్రీనివాస థియేటర్ సమీపంలో ఉన్న వీరనారాయణ స్వామి అందుల ఆశ్రమంలో అందులకు వైయస్ భారతి రెడ్డి 49వ జన్మదినాన్ని పురస్కరించుకొని జిల్లా చేనేత ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరయ్య ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సింహాద్రిపురం వైకాపా మండల అధ్యక్షులు దేవి రెడ్డి శ్రీకాంత్ రెడ్డి హాజరై ఆయన ఏర్పాటు చేసిన కేకును కట్ చేసి అందులకు పంపిణీ చేశారు. అనంతరం అందులకు మాంసాహారం తో కూడిన బిర్యాని, పండ్లు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొప్పింటి కోడలిగా, అన్నిట్లో భర్తకు అండగా ఉంటూ, పిల్లలను సరి దిద్దడంలో మంచి తల్లిగా, ఆడపడుచులకు అక్కగా, చెల్లెలుగా అందరి మన్ననలు పొందిన గొప్ప వ్యక్తి వైయస్ భారతమ్మ అన్నారు. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ రసూల్, చంద్రమౌళి, వీరారెడ్డి,శ్రీరాములు, గంగరాజు, రాకేష్, వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వృత్తి విద్య- ఉపాధి విద్య





**డోన్ - సూర్య వాస్తవం, డిసెంబర్ 9 :** ప్రభుత్వ జూనియర్ కళాశాల, డోన్ లో వృత్తి విద్యా గ్రూపు అకౌంటింగ్ మరియు టాక్సేషన్ విద్యార్థిని విద్యార్థులు ఆన్ ద జాబ్ ట్రైనింగ్ కార్యక్రమం నవంబర్ 24, 2025 నుండి డిసెంబర్ 31 2025 వరకు నిర్వహించబడుతుంది. ఇందులో భాగంగా డిసెంబర్ 9, 2025న డోన్ పట్టణంలోని పకృతి వైపరీత్యాలు మరియు అగ్ని ప్రమాదాల నివారణ శాఖ ఆధ్వర్యంలో అకౌంటింగ్ ,టాక్సేషన్ విద్యార్థిని విద్యార్థులకు అగ్ని ప్రమాదాలకు గల కారణాలు, అగ్ని ప్రమాదాల రకాలు, అగ్ని ప్రమాదాలను ఏ విధంగా నివారించవచ్చు మరియు పకృతి విపత్తులో ప్రమాదాల గురించి ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలి మొదలైన అంశాలతో పాటుగా ఫ్యాక్టరీలు, సినిమా థియేటర్లు, పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ గృహాలు మరియు గ్రామీణ ప్రాంతా లలో గడ్డివాములు మొదలైన ప్రదేశాలలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఏ విధంగా నివారించాలి వ్యాపార సంస్థలు అగ్ని ప్రమాదాలు సంభవించ సంభవించకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, అనుకోని పకృతి విపత్తులు సంభవించినప్పుడు ఏ విధంగా స్పందించాలి మొదలైన అంశాలపై ఫైర్ ఆఫీసర్ రంగస్వామి గౌడ్ ఆధ్వ ర్యంలో లీడింగ్ ఫైర్ మాన్ ప్రభాకర్ మరియు ఇతర అగ్నిమాపక సంస్థ సిబ్బంది విద్యార్థిని విద్యార్థులకు ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్ కృష్ణయ్య ఆన్ ద జాబ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఇన్‌స్పెక్షన్ నిమిత్తం సందర్శించి విద్యార్థులకు వివిధ ప్రశ్నలు వేసి అడిగి తెలుసుకున్నారు. అలాగే అగ్ని ప్రమాదాల నివారణ పైన అవగాహన పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అకౌంటింగ్. టాక్సేషన్ అధ్యాపకులు ధనుంజయ శెట్టి, వెంకటస్వామి, హిందీ అధ్యాపకులు అన్వర్ సాహెబ్ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి హాకీ సంబరం

### - ప్రారంభించిన జడ్పీటీసీ లతా రెడ్డి



**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 9 :** పులివెందుల లోని క్రీడా మైదానంలో అండర్-17 రాష్ట్రస్థాయి హాకీ పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను అధికారికంగా ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్న ఆమె, వారిలో స్ఫూర్తిని నింపుతూ మాట్లాడారు. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి ఎదిగిన క్రీడాకారులను ఆమె అభినందించారు. క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా, ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు తన వంతు సహకారంగా రూ.10,000 నగదు బహుమతిని మొదటి బహుమతి ప్రకటించారు. రెండో బహుమతిగా రిటైర్డ్ పి ఈ టీ విజయ ప్రసాద్ రెడ్డి 5,000,హాకీ అసోసియేషన్ మూడో బహుమతిగా 3000, బెస్ట్ ప్లేయర్స్‌కి 6000 మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్ ప్రకటించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి వచ్చిన క్రీడాకారులకు మారెడ్డి లతా రెడ్డి శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫైడ్ డైరెక్టర్ శశిభూషన్ రెడ్డి, పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్ ,పుష్పగిరి స్కూల్ కస్పాండెంట్, టీడీపీ నాయకుడు ఓబుల్ రెడ్డి, అధికారులు, హాకీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.




# టెట్ పరీక్ష కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

### - డీఆర్ఓ మధుసూదన్ రావు



**రాయచోటి - సూర్య వాస్తవం, డిసెంబర్ 9:** ఈనెల 10వతేదీ నుంచి 21వతేదీ వరకు టెట్ (ఏపీ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్) పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, ఇందుకోసం పక్కాగా ఏర్పాట్లు చేయాలని డిఆర్ఓ మధు సూదన్ రావు ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం లోని డిఆర్ఓ చాంబర్‌లో ఏపీ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ పై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందరరేగా డిఆర్ఓ మాట్లాడుతూ ఏపీ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ - అక్టోబర్ 2025ను ఈనెల 10వతేదీ నుంచి 21వతేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని, ఇందుకోసం జిల్లాలో 4 కేంద్రాలను ఎంపికచేయడం జరిగిందన్నారు. వాటిలో మదనపల్లి లోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ 1798 మంది, అంగళ్లు సమీపంలోని మదనపల్లి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల లో 200 మంది (14.12.2025 న ఉదయం మాత్రమే), రాయచోటి లోని శ్రీ సాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ 1080 మంది, రాయచోటి లోని భాస్కర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నా లజీ అండ్ సైన్స్ కళాశాలలో 1845 మంది మొత్తం 4923 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరు కావడం జరుగుతుందని, టెట్ పరీక్ష ప్రతి రోజు రెండు సెషన్లలో నిర్వహించడం జరుగుతుందని, సెషన్ వన్ ఉదయం 9:30 గంటల నుంచి 12 గంటల వరకు, సెషన్ 2 మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పరీక్షలకు డిపార్ట్మెంటల్ ఆఫీసర్లుగా మదనపల్లి లోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ సెంటర్ కు మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ కె. ప్రభాకర్ రెడ్డి,మదనపల్లి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల సెంటర్ కు ఎంఈఓ కె.ద్వారకనాథ్, సాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ సెంటర్ కు ఎం.బాలాజీ నాయక్,భాస్కర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలకు పి. జయచంద్ర నియమించడం జరిగిందని, ఫ్లయింగ్ స్క్వాడ్ లుగా డిప్యూటీ ఈవో లు వై లోకేశ్వర రెడ్డి, ఎల్. నాగయ్య, ఏడి బి రవి కుమార్ ను నియమించడం జరిగిందని డిఆర్ఓ తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాలకు సంబంధించి హెల్ప్ డెస్క్ ఫోన్ నెంబర్లు. అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్: 8341177406, 8555931971, సూపరింటెండెంట్: 9949915837, సీనియర్ అసిస్టెంట్: 7013622899, డేటా ఎంట్రీ ఆపరేటర్:9492277147 ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే పోలీస్, సూపరిం టెండెంట్ ఇంజనీరింగ్ ఏపీఎస్పీడీసీఎల్ నిరంతరం విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, ఏపీఎస్ఆర్టీసీ అధికారులు అభ్యర్థుల కోసం ఆర్టీసీ వారు సరిపడే బస్సులు ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయాలని, పోలీస్ వారు బందోబస్తు నిర్వహించాలని, కేంద్రాలలో మెడికల్ అండ్ హెల్త్ వారు ఫస్ట్ ఎయిడ్ కిట్స్ ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షలకు సంబంధించిన అధికారులు ఒక వాట్సాప్ గ్రూప్ ను తయారు చేసి ఎప్పటికప్పుడు సమాచారాన్ని పై అధికారులకు తెలియజేయాలని, ఆయా అధికారులు సమన్వయంతో పనిచేసి అన్ని రకాల ఏర్పాట్లు చేపట్టాలని టెట్ పరీక్షలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా డిఇఓ సుబ్రహ్మణ్యం, డిఎంహెచ్ఓ లక్ష్మీ నరసయ్య, ఉపవిద్యా శాఖ అధికారులు, ఎంఈఓ లు, పోలీస్, ఏపీ ఎస్పీడీసీఎల్ ,ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నిస్వార్థ ప్రజా సేవకురాలు సోనియా గాంధీ

### - డీసీసీ చీఫ్ సెక్రటరీ అమీర్



**రాయచోటి-సూర్య వాస్తవం, డిసెంబర్ 9:** నిస్వార్థ ప్రజా సేవకురాలు సోనియా గాంధీ సుదీర్ఘకాలంగా భారత జాతీయ కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షురాలుగా వ్యవహరించారని డిసిసి చీఫ్ సెక్రెటరీ అమీర్ అన్నారు. ఏఐసిసి అగ్ర నాయకురాలు సోనియా గాంధీ 78వ పుట్టినరోజు వేడుకలను పట్టణంలోని డిసిసి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. డిసిసి అధ్యక్షుడు గాజుల భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిసిసి అధికార ప్రతినిధి మన్సూర్ అలీ ఖాన్, పట్టణ అధ్యక్షుడు బాబా సర్దార్ లు హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ రాజకీయ చరిత్రలో సోనియా గాంధీ స్థానం సువర్ణాక్షరాలతో లిఖించదగ్గదని అన్నారు. ప్రధానమంత్రి పదవి వరించే అవకాశం ఉన్నా ఆ పదవిని తృణప్రాయంగా వదులుకుని దేశ రాజకీయాల్లో నిస్వార్థ సేవకు నిదర్శనంగా నిలిచిన త్యాగశీలి అని ఆయన కొనియాడారు. యుపిఎ ప్రభుత్వ హయాంలో దేశ ప్రజల కోసం సమాచార హక్కు చట్టం,ఆహార భద్రత చట్టం, పేదలకు అండగా నిలిచిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వంటి విప్లవాత్మక చట్టాలను తీసుకురావడంలో సోనియాగాంధీ కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా ఆయనగుర్తు చేశారు. క్లిష్ట సమయాల్లో కాంగ్రెస్ పార్టీ పగ్గాలు చేపట్టి, పార్టీని ముందుకు నడిపించి, కార్యకర్తలలో మనోధైర్యాన్ని నింపిన గొప్ప నాయకురాలని ఆయన ప్రశంసించారు. ఆమెనిండునూరేళ్లుఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షుడు దర్బార్, రాయచోటి పట్టణ అధ్యక్షుడు బాబా సర్దార్, చిన్నమండెంమండలఅధ్యక్షుడుషబ్బీర్,బషీర్ ,వలిఖాన్, మహిళా అధ్యక్షురాలు స్వనజా రెడ్డి పలువురు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొనరు.

## చదువు రాని మహిళలకు శిక్షణ

### - డీఆర్డీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ఆంజనేయులు



**వేముల - సూర్య వాస్తవం, డిసెంబర్ 9:** వేముల మండలం నల్లచెరువు పల్లె గ్రామంలో అక్షర ఆంధ్ర ఉల్లాష్ కార్యక్రమంలో భాగంగా చదువు రాని మహిళలకు చదువు నేర్పించే కార్యక్రమాన్ని వెలుగు డిఆర్డిఏ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ఆంజనేయులు పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువురాని మహిళలకి టిసిఎస్‌వారు తయారుచేసిన డిజిటల్ లీటరసి,ఫైనాన్షియల్ లీటరసి, ఫంక్షనల్ లీటరసి, లీగల్ లీటర్ సి ని 100 రోజులు 100 గంటలు లలో గ్రామంలోని వాలంటీర్స్ టీచర్స్ నేర్పిస్తారని తెలిపారు. అక్షర ఆంధ్ర కార్యక్రమంలో లిటరసీ ద్వారా విద్య నేర్చుకున్నటువంటి మహిళలకి శిక్షణ అనంతరము పరీక్షను నిర్వహించి సర్టిఫికెట్ ప్రధానం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామంలో స్వచ్ఛందంగా చదువు నేర్పించడానికి ముందుకు వచ్చిన వాలంటీర్ని టీచర్లుకు ప్రభుత్వం నుండి సర్టిఫికెట్ ఇచ్చి సహకరిస్తారని, వాలంటీర్స్ టీచర్స్ ఉచితంగా చదువు నేర్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్ జైపాల్ గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు గ్రామ సమాఖ్య అసిస్టెంట్ జయరాజ్ డ్వాక్రా లీడర్లు చదువురాని మహిళలు పాల్గొన్నారు.

## నల్లచెరువుపల్లె గ్రామస్తులు టీడీపీ నుండి వైసీపీలోకి చేరికలు

### - పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన వైసీపీ శ్రేణులు



**వేముల - సూర్య వాస్తవం, డిసెంబర్ 9:** అభివృద్ధి అంటే ఒక జగన్‌తోనే సాధ్యమవుతుందని, టిడిపి పార్టీని వీడి వైసిపి పార్టీలోకి చేరడం జరుగుతుందని నల్లచెరువుపల్లె గ్రామస్తులను వేముల మండల వైసిపి నాయకులు వైసిపి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. మంగళవారం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వేముల మండలం కన్వీనర్ సాంబశివరెడ్డి,జడ్పీటీసీ కోగటం బయపు రెడ్డి సమక్షంలో నల్లచెరువుపల్లి లో టిడిపి నుంచి వైసీపీలో చేరిన రామిరెడ్డి మురళీ మోహన్ రెడ్డి,హరిజన వాడకు చెందిన అరిగల ఆటో శివ,అరిగల గంగులయ్యా, అట్లూరి గంగయ్య, కుటుంబాలు టీడీపీని వీడి వైసిపి లో చేరాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ బోర్డు మాజీ డైరెక్టర్ మరక శివ కృష్ణా రెడ్డి యాదవ్, చల్లా నారాయణ, ఎంపీటీసీ నరసింహ రెడ్డి,ఎక్స్ సర్పంచ్ వర్ర నారాయణ రెడ్డి, వర్రా లక్ష్మి రెడ్డి,మాజీ సర్పంచ్ రాజారెడ్డి,ప్రసాద్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, చిన్నిరెడ్డి, సతీష్ రెడ్డి, రమణారెడ్డి, వెంకటేష్, వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మహిళా కళాశాలలో ఎన్.ఎస్.ఎస్ కార్యక్రమం




**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 9 :** పులివెందులలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్.విభాగము ఆధ్వర్యంలో జరుగుతున్న పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నల్లపురెడ్డిపల్లిలో అరవ రోజు నిర్వహించారు. 50 మంది ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లుఎన్ ఎస్ ఎస్ పి ఓ ఎన్.శ్రీనివాసులు రెడ్డి అధ్వర్యంలో నీరు సక్రమంగా ఉపయోగించకపోతే భవిష్యత్తు తరాలకు కలిగే నష్టాలనుగురించి ప్రజలలో అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ ఎన్ శ్రీనివాసులురెడ్డి, సూపరింటెండెంట్ ఆనంద్‌రావు, జ్యోత్స్న మరియుఅధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, గ్రామ ప్రజలు, డిష్ వెంకటేష్ పాల్గొన్నారు. అలాగే రేపు ఎన్ఎస్ఎస్ కార్యక్రమం ముగింపు రోజు అని కలశాల ఇంచార్జి ప్రిన్సిపల్ డాక్టర్ సి. బాలన రాయణ తెలిపారు.

## ప్రజలు ఇంటి పన్ను త్వరితగతిన చెల్లించాలి

**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 9 :** మండలంలోని లక్కిరెడ్డిపల్లి పంచాయతీలోని ప్రజలందరూ సహకరించి ఇంటి పన్ను త్వరితగతినే చెల్లించాలని ఈవో పి ఆర్ డి ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఇంటి యజమాని తన ఇంటి నెంబరుతో సెల్ ఫోన్లోనే ఇంటి పన్ను జనరేటర్ అవుతుందని ప్రతి ఒక్క ఇంటి యజమాని సెల్ ఫోన్ సహాయంతో ఇంటి పన్నులు చెల్లించవచ్చన్నారు. ప్రజలు దీనికి సహకరించాలన్నారు. ఇంటి పన్ను చెల్లించి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని ఆమె సూచించారు.

## వైసీపీ అనుబంధ కమిటీ సమావేశం



**లింగాల - సూర్య వాస్తవం, డిసెంబర్ 9 :** లింగాల మండలం మురారిచింతల గ్రామంలో మంగళవారం వైసీపీ అనుబంధ కమిటీ సమావేశం సారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, బాబు రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, వైకాపా నాయకులు నిర్వ హించారు. ఈ సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణ పై, అలాగే రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలపై నాయకులు సుదీ ర్ఘంగా చర్చించారు. గెలుపే లక్ష్యంగా పోరాడాలని, ప్రతి కార్యకర్త సైనికుడిలా పోరాడితే విజయం మన సొంతం అవు తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## "పోలీస్ కళా-జాగృతి బృందం" నాటక ప్రదర్శన

### - విద్యార్థులకు అవగాహన



**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 9 :** జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ వారి ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం లయోలా డిగ్రీ కాలేజ్ పులివెందులలో "పోలీస్ కళా-జాగృతి బృందం" ఇన్‌చార్జ్ జి.నరసరామ్, టీమ్ చే 'ఓయువతా... మేలుకో" నాటక ప్రదర్శన ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా పులివెందుల ఏఎస్ఐ వర్మ మాట్లాడుతూ నేటి సమాజంలో యువత "డ్రగ్స్"కు దూరంగా ఉండి భవిష్యత్తును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా వుంటూ మీ తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న ఆశలను నేరవేర్చాలని హితువు పలికారు. మత్తు పదార్థాలు వాడిన, అమ్మిన, ఆశ్రయం కల్పించిన దానికి తగిన శిక్షలు గురించి తెలియజేశారు. మత్తు పదార్థాల ఆచూకీ తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1972కి కాల్ చేసి తెలియజేయాలన్నారు. కాలేజ్ ప్రిన్సిపాల్ జోజిరెడ్డి మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకం వల్ల ప్రజలకు వచ్చే ఆరోగ్య సమస్యలు, సమాజంలోని రుగ్మతలు వాటివలన కలిగే అనర్థాల గురించి వివరించారు. అలాగే నార్కోటిక్స్ ఏ.ఎస్.ఐ. మల్లయ్య మాట్లాడుతూ "యువతా మేలుకో-మత్తు నుండి తేరుకో, డ్రగ్స్ వద్దు- జీవితం ముద్దు, మత్తు పదార్థాలకు దూరంగా ఉందాం- భవిష్యత్తును కాపాడుకుందాం అని నినాదాలు చేయించారు. "పోలీసు కళా-జాగృతి బృందం" ప్రదర్శన విద్యార్థులను విశేషంగా అలరించింది. ఈ కార్యక్రమంలో ఎస్బి హెచ్‌సి మస్తాన్, బృంద సభ్యులు సుశీల, మేషక్ బాబు, ఉదయ్ కుమార్, శ్రీరామ్ కుమార్, మధుసూదన్, కరుణాకర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వన చిన్నప్ప, అధ్యాపకులు సిబ్బంది మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉలిమెళ్ళ గ్రామ అనుబంధ

## విభాగ కమిటీల సమావేశం





**పులివెందుల- సూర్య వాస్తవం, డిసెంబర్ 9 :** వైఎస్ఆర్సిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి, వైయస్ అవినాష్ రెడ్డి ఆదేశాల మేరకు వై.యస్.ఆర్.సి.పి గ్రామ అనుబంధ విభాగాల కమిటీ పర్యవేక్షణ మంగళవారం ఉలిమెల్లగ్రామంలో వైకాపా నాయకుడు శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్ పద్మావతి ల ఆధ్వర్యంలో నాయకుల ,కార్యకర్తల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మున్సిపల్ వైకాపా ఇన్చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, ఉలిమెల్ల కౌన్సిలర్ అవుకు పద్మావతి, మాజీ చైర్మన్లు చిన్నప్ప ,రసూల్, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు కౌన్సిలర్ పార్నపల్లె కిషోర్, దేరంగుల చంద్రమౌళిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి గ్రామ అనుబంధాల కమిటీ సమావేశాలు పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడమే లక్ష్మన్నారు. రాబోయే ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సన్నద్ధమై ఉండాలన్నారు. ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీలను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్ రెడ్డి, తులసీరామి రెడ్డి, సుదర్శన్ రెడ్డి, శ్రీరామిరెడ్డి, జనార్దన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రఘు, గంగన్న, రమేష్, మండల వైసీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర అభివృద్ధి కోసం

# నిరంతరం ప్రజా సేవ చేస్తున్న ముఖ్యమంత్రి



**వేంపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 9 :** రాజకీయం అంటే అధికారం చెలాయించడం కాదు. ప్రజలిచ్చిన అధికారాన్ని దేశ, రాష్ట్ర ప్రజల అభివృద్ధికి వినియోగించాలని ప్రజా నాయకుడు అన్న ఎన్టీఆర్, అన్నారని... గిరిజన కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్,మేదర రవికుమార్, అన్నారు. అనంతరం మాట్లాడుతూ. 2025 -26 ఆర్థిక సంవత్సరంలో రెండో త్రైమాసి కానికి సంబంధించిన గణాంకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని స్థిర ధరల వద్ద నమోదైన ఆర్థిక వృద్ధి రాష్ట్ర స్థూల ఉత్పత్తి గ్రాస్ వ్యాల్యూ అడిషన్ వ్యవసాయం ఉత్పత్తి వివిధ సేవ రంగాలను నమోదు చేశారని అభివృద్ధి గుణాంకాల విడుదల చేశారని 2025 - 26 తొలి అర్ధ సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ అలాగే రెండవ త్రై మాసికం ప్రస్తుతం ధరల్లో రాష్ట్ర జీఎస్టి పి మొత్తంగా 11.28శాతం వృద్ధి రేటు నమోదయిందని 2029 నాటికి ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ మిషన్ ద్వారా ప్రభుత్వం విద్య వ్యవస్థను నెంబర్ వన్ గా నిలపడానికి మెగా పిటిఎం 3 ఫాంట్ జీరో వేదికగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశ నిర్దేశం చేశారని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలను మరియు సోషల్ మీడియా ద్వారా ప్రజలకు కూటమిపాలనలో జరుగుతున్న మంచి అభివృద్ధిపై ప్రజలకు అవగాహన కల్పించే అంశాలపై పార్టీ మండల అధ్యక్షులకు ప్రధాన కార్య దర్శులకు టిడిపి కేంద్ర కార్యాలయంలో శిక్షణ తరగతులను నిర్వహించారని మహిళలను గౌరవించే విధంగా స్పష్ట మైన సమాచారాన్ని ప్రజలకు అందించే విధంగా శిక్షణ తరగతులను విజయవంతం చేశారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతో నిరంతరం సమష్టి కృషితో ప్రజా సేవ చేస్తున్నట్లు మేదర రవికుమార్ తెలిపారు.

## ప్రభుత్వ భూముల జోలికి వస్తే కఠిన చర్యలు తప్పవు



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 9 :** ఎవరైనా ప్రభుత్వ భూముల జోలికి వస్తే ఎంతటి వారైనా ఉపేక్షించే లేదని కఠిన చర్యలు తప్పవని తహసిల్దార్ క్రాంతి కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పాత బంగ్లా ఎదురుగా ఉన్న 637/1,637/3 సర్వే నెంబర్లు గల భూమిని మంగళవారం తహసిల్దార్ క్రాంతి కుమార్ ఆర్.ఐ రాజేష్ రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ గతంలో ఈ ప్రాంతంలో సభలు ఏర్పాటు చేసుకొనే స్థలమని 27 సెంట్లు భూమి ఉందని ఈ భూమి ఎలాంటి వ్యక్తులకు ప్రవేశం గాని, ఎవరికి పట్టాలు గాని ఇవ్వలేదని తహసిల్దార్ కార్యాలయంలో సర్వే నెంబర్ 637/1,637/3 భూమి ఎవరికి ఇచ్చినట్లు రికార్డులు లేవని ఆయన తెలిపార. అదే కాకుండా గతంలో 27 సెంట్ల ప్రభుత్వ భూమికి సంబంధించి బోర్డులు కూడా ఏర్పాటు చేశారని ఈ స్థలం ఎవరైనా అమ్మినా కోనీన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ స్థలాన్ని పరిశీలించి మళ్లీ బోర్డులు ఏర్పాటు చేస్తామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన పీఎం ఉషా వర్క్‌షాప్

**వేంపల్లె - సూర్య వాస్తవం, డిసెంబర్ 9 :** మహిళా స్వావలంబన కొరకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రైమ్ మినిస్టర్ ఉషా పథకం మంగళవారం స్థానిక వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా జరిగింది. సమాజంలో రోజు రోజుకు పెరుగుతున్న మహిళా జనాభాను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం వారి ఆర్థిక, సామాజిక స్వావలంబన కొరకు డిగ్రీ కళాశాలలో అనేక కార్యక్రమాలను ప్రారంభించింది. అందులో భాగంగా తమ కళాశాలను ఎన్నుకోవడం జరిగింది. ఇందులో భాగంగా గతంలోనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మీద సర్టిఫికెట్ కోర్సును పూర్తి చేయడం జరిగింది. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వము నియమించిన ఇద్దరు రిసోర్స్ పర్సన్స్ ఉదయం, మధ్యాహ్నం రెండు ప్రత్యేకమైన అంశాల మీద విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఉదయం యాక్సిస్ పాయింట్ సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్ట్ మేనేజర్ పల్లా యశస్వి కంటిన్యూస్ లెర్నింగ్ త్రు ఆన్లైన్ ప్లాట్ ఫార్మ్ మీద మాట్లాడారు, సాయంత్రం యాక్సిస్ పాయింట్ సాఫ్ట్వేర్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్ట్ లీడర్ రాపర్తి శ్రావని ప్రతి ఎమ్ఎన్ సి కంపెనీలో బాగా దోహదపడే రెస్యూమ్ ల ప్రిపరేషన్ గురించి వివరంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాలకు చెందిన బిఏ, బీకాం, బీఎస్సీ విద్యార్థులు దాదాపు 120 మంది మహిళ విద్యార్థులు పాల్గొని జయప్రదం చేశారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగేంద్ర పర్యవేక్షించగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మరియు పీఎం ఉషా కోఆర్డినేటర్ డాక్టర్ కొండా సతీష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు అందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ప్రధానం చేయడం జరిగింది. చివరగా రరిసోర్స్ పర్సన్స్ ఇద్దర్నీ కళాశాల ప్రిన్సిపాల్ మరియు అధ్యాపక సంఘం ఘనంగా సన్మానించారు. ఈ సందరరేగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పీఎం ఉషా కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి తమ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎన్నుకోవడం పట్ల ఆయన అభినందనలు తెలియజేశారు. అంతేకాకుండా ఈ కార్యక్రమం విజయవంతం జరగడానికి కారణం అయినటువంటి కన్వీనర్ కొండ సతీష్ ను ప్రత్యేకించి అభినందించారు




## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### - మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ జయరామయ్య



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 9 :** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి జయరామయ్య పేర్కొన్నారు. మంగళవారం లక్కిరెడ్డిపల్లి కమ్యూనిటీ ఆసుపత్రిలో పరిధిలోని ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న అసిస్టెంట్లతో సీజనల్ వ్యాధులపై నియంత్రణ గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వర్షాకాలంలో లార్వా మరియు జ్వరాలు సర్వేలను నిర్దే శించిన ప్రకారం నిర్వహించాలని జ్వరపు కేసులను గుర్తించి వారి నుండి రక్త నమూనాలను సేకరించాలని, గ్రామా లలో అపరిశుభ్రత పారిశుద్ధ్య వాతావరణం ఉంటే డ్రైనేజ్ బ్లాక్ దిబ్బలు వంటి వల్ల అంటువ్యాధులు ప్రభులే అవకా శాలు ఉన్నాయన్నారు. వీటన్ని శుభ్రం చేయించాలన్నారు. లైన్ డిపార్ట్మెంట్ యొక్క సహాయం తీసుకొని అవుట్ బ్రేక్స్ రాకుండా చేయాలన్నారు. దోమల వలన విష జ్వరాలు డెంగ్యూ మలేరియా ప్రభలే అవకాశాలు ఉన్నాయని వీటిని నియంత్రించేందుకు జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం మలేరియాకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైసీపీ గ్రామ కమిటీల సమావేశం



**తొండూరు- సూర్య వాస్తవం, డిసెంబర్ 09 :** వైకాపా మండల అధ్యక్షుడు భూమిరెడ్డి రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలోని మల్లెల, సంతకోవ్వరు, బోడివారిపల్లె భూచుపల్లె గ్రామంలో వైకాపా గ్రామ కమిటీ సమావేశం నిర్వహి ంచార్ను ఆయా గ్రామాల్లో కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షురాలు భూమిరెడ్డి జయప్రద, మండల పరిశీలకుడు బండి రామముని రెడ్డి, కొప్పల బంగారు మునెయ్య, జింకా అశ్వని కుమార్, సర్పంచ్ మార్తల గురుమోహన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొప్పల శివశంకర్ రెడ్డి, మడూరు ఎంపీటీసీ శంకర్, తదితర వైకాపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మహిళలు పాల్గొన్నారు.

## శ్రీ మల్లెలమ్మ తల్లి 14వ వార్షికోత్సవం

**వేంపల్లె - సూర్య వాస్తవం, డిసెంబర్ 9 :** ఇడుపులపాయ ఆర్కేవ్యాలిలో వెలసిన శ్రీ మల్లేలమ్మ తల్లి దేవస్థానంలో ఆలయ 14వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ చతుర్దశ వార్షికోత్సవ పూజా కార్యక్రమాల్లో భాగంగా అర్చకులు శాకల్య గురుమూర్తి నేతృత్వంలో ఉదయం అమ్మవారికి విశేష సుగంధ ద్రవ్యాలతో, పంచామృతములతో అభిషేకం, కుంకుమార్చన, నివేదన, మహా మంగలహారతి నిర్వహించారు. అనంతరం అమ్మవారిని తోమాలలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ప్రధాన కలశారాధన, నవగ్రహ పూజ, శాంతి హెూమం దుర్గాసూక్త హెూమాలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయంలో అమ్మవారికి ట్రిపుల్ డైరెక్టర్ ఏవిఎస్ఎస్ కుమార స్వామి గుప్తా, మాజీ డైరెక్టర్ కృష్ణారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం అమ్మవారికి ఊంజల సేవ నిర్వహించారు. అలాగే మంగలవాయిద్యాల నడుమ శ్రీ మల్లేలమ్మ తల్లి గ్రామోత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహించామన్నారు. ఏర్పాటు చేసిన కోలాటం, మల్లేలమ్మ భజన తదితర సంస్కృతి కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.








# ‘అఖండ 2 : తాండవం’కు లైన్‌క్లియర్

## 11న ప్రీమియర్స్ : 12న థియేటర్లలో విడుదల

మద్రాస్ హైకోర్టు గ్రీన్‌సిగల్ ఇవ్వటంతో ఈనెల 12న ‘అఖండ 2 : తాండవం’ సినిమా విడుదల కానుంది. ఈమేరకు హైదరాబాద్‌లో మంగళవారం సాయంత్రంనాడు 14 రీల్స్ ఫ్లస్ సంస్థ తరపున నిర్మాతలు రామ్ ఆచంట, గోపి ఆచంట మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈరోస్ సంస్థకు 14 రీల్స్ ఫ్లస్ సంస్థల మధ్య జరిగిన చర్చలు ఫలప్రదం కావటం తో వివాదం కొలిక్కి వచ్చింది. 11న రాత్రి 9 గంటల నుంచి ప్రీమియర్స్, 12న థియేటర్లలో సినిమా విడుదల చేస్తామని ప్రకటించారు. పలు బాషల్లో బాలకృష్ణ-సంయుక్త మీనన్ జోడీగా తెరకెక్కిన సినిమా ‘అఖండ 2 : తాండవం’ ఈనెల ఐదోతేదీన విడుదల కావాల్సివుండగా ఆర్థిక లావాదేవీల వ్యవహారంతో వాయిదాపడిన విషయం తెలిసిందే. తాజాగా క్లియరెన్స్ రావటంతో డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబ్యూటర్లతో నిర్మాతలు చర్చలు జరుపుతున్నారు. మిగతా భాషల్లోనూ ఈ సినిమా విడుదల కానుంది.

**టిక్కెట్ల రేట్లు పాతవేనా?**

గతంలోనే ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ సినిమా టిక్కెట్ల రేట్లను ప్రభుత్వాలు పెంచేశాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ స్క్రీన్‌లో రూ.50, మల్టీప్లెక్స్‌ల్లో రూ.100 ఒక్కో టిక్కెట్‌పై మూడురోజులపాటు పెంచుకోవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొంది. అప్పట్లో ప్రీమియర్స్‌కు కూడా అనుమతి నిచ్చింది. ఈ ఒక్క షోకు ఏకంగా రూ.600 వసూలు చేసుకునే అవకాశం కల్పించింది. ఎపిలో ఇప్పటికే అఖండ-2 మూవీ టిక్కెట్ ధరలు పెంపునకు ప్రభుత్వం అనుమతులిచ్చింది. సింగిల్ స్క్రీన్స్‌లో రూ.75, మల్టీప్లెక్స్‌లో రూ.100 పెంచుకోవచ్చని ఉత్తర్వులను గతంలో జారీ చేసింది. ప్రీమియర్ షోలకు అనుమతి ఇవ్వడంతో పాటు.. ఏకంగా రూ.600లుగా టిక్కెట్ ధరలను నిర్ణయించింది. సినిమా ఆగిపోవటం, మళ్లీ తేదీ మారటంతో టిక్కెట్ల రేట్లు అలాగే ఉంటాయా? లేదా? మారతాయా? అనేది ఆయా రాష్ట్రప్రభుత్వాల నిర్ణయంపైనే ఆధారపడివుంటుంది.

**ఓవర్సీస్‌లో విడుదల ఆలస్యం!**

ఓవర్సీస్‌లో ‘అఖండ 2 సినిమా విడుదల ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే హాలీవుడ్‌లో రెండు పెద్ద సినిమాల విడుదలతో థియేటర్లు బుక్కయ్యాయి. బాలకృష్ణ సినిమాకు వెంటనే ఓవర్సీస్‌లో థియేటర్లు కేటాయింపుకు సమయం పడుతుంది. ప్రపంచంలోని పలు దేశాల్లో థియేటర్లు కేటాయింపు ఉన్న చోట్ల విడుదలచేసి మిగిలిన చోట్ల మరోతేదీన విడుదల చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఓవర్సీస్‌లో ఆన్‌లైన్‌బుకింగ్‌లకు సైట్ ఓపెన్ అయినట్లుగా సమాచారం.

## నీరజతో నితిన్..
# ఆ మ్యాజిక్ రిపీట్ అవుతుందా?



టాలీవుడ్ యంగ్ హీరో నితిన్.. కొంతకాలంగా సరైన హిట్ కోసం వెయిట్ చేస్తున్న విషయం తెలిసిందే. ఒకప్పుడు వరుస విజయాలతో మెప్పించిన ఆయన.. ఇప్పుడు సక్సెస్ కోసం కొన్నేళ్లుగా ఎదురుచూస్తున్నారు. 2020లో వచ్చిన భీష్మ తర్వాత ఇప్పటి వరకు నితిన్ ఖాతాలో ఒక్క హిట్ కూడా పడలేదు. వరుసగా ఆరు డిజాస్టర్లు పడ్డాయి. దీంతో నితిన్ నెక్స్ట్ ఎవరి డైరెక్షన్ లో నటిస్తారోనేది పెద్ద క్వశ్చన్ మార్క్ గా మారింది. ఎందుకంటే ఆయన మార్కెట్ బాగా డౌన్ అవ్వగా.. కచ్చితంగా హిట్ పడాల్సిన అవసరం ఉంది. కానీ నితిన్ తదుపరి సినిమా విషయంలో సస్పెన్స్ కొనసాగుతోంది.

నిజానికి.. ఇప్పుడు ఆయన వేణు ఎల్దండి డైరెక్షన్ లో ఎల్లమ్మ మూవీ చేయాల్సి ఉంది. విక్రమ్ కె కుమార్ దర్శకత్వంలో అనుకున్న సినిమా ఆగిపోయినట్లు తెలుస్తోంది. శ్రీను వైట్లతో అనుకున్న ప్రాజెక్టు కేవలం ప్రచారానికే పరిమితమైంది. లిటిల్ హార్ట్స్ ఫేమ్ సాయి మార్తాండ్ డైరెక్షన్ లో మూవీ చేస్తారని వార్తలు వచ్చినా.. ఇప్పటి వరకు ఎలాంటి అనౌన్స్మెంట్ రాలేదు. దీంతో నితిన్.. కొత్త సినిమా ఎవరితో చేస్తారోనని అంతా మాట్లాడుకుంటున్నారు.

అయితే దర్శకురాలు నీరజ కోన.. నితిన్ తో సినిమా చేయనున్నట్లు తాజాగా వెల్లడించారు. ప్రముఖ కాస్ట్యూమ్ డిజైనర్ అయిన ఆమె.. తెలుసు కదా మూవీతో డైరెక్టర్ గా మారారు. రాడికల్ లవ్ స్టోరీతో రూపొందించిన ఆ సినిమా.. అనుకున్నంత స్థాయిలో మెప్పించలేకపోయింది. కొందరికి మూవీ నచ్చినా.. కమర్షియల్ గా వర్కౌట్ మాత్రం అవ్వలేదు. ఇప్పుడు నితిన్ తో మంచి లవ్ స్టోరీ తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నారట. ఇప్పటికే నితిన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో ఆ విషయం ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. నితిన్.. ఈసారైనా హిట్ అందుకుంటారా అని మాట్లాడు కుంటున్నారు. నిజానికి.. లవ్ స్టోరీలు నితిన్ కు బాగా కలిసి వస్తాయనే చెప్పాలి. గతంలో వరుస ఫ్లాప్స్ తో సతమతమైన నితిన్.. లవ్ స్టోరీ జోనర్ లో తెరకెక్కిన ఇష్క్ తో కమ్ బ్యాక్ ఇచ్చారు.

ఆ తర్వాత గుండె జారి గల్లంతైందే సినిమాతో కూడా మెప్పించారు. బాక్సాఫీస్ వద్ద హిట్స్ ను అందుకున్నారు. కాబట్టి నీరజ కోనతో చేయబోయే సినిమాతో మ్యాజిక్ రిపీట్ అయితే నితిన్ కెరీర్ గాడిలో పడుతుంది. మరేం జరుగుతుందో వేచి చూడాలి.



## శ్రీలంకతో టి20
# సిరీస్‌కు జట్టు ప్రకటన




- శ్రీచరణి, అరుంధతి రెడ్డికి చోటు
- షెఫాలీ రీ ఎంట్రీ

**ముంబయి:** ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్‌ను చేజిక్కించుకున్న టీమిండియా తొలిసారి స్వదేశంలో టి20 సిరీస్‌కు సిద్ధమైంది. శ్రీలంకతో జరిగే ఐదు టి20ల సిరీస్‌కు కడపకు చెందిన శ్రీచరణి, హైదరాబాద్‌కు చెందిన అరుంధతి రెడ్డిలకు ఎంపికయ్యారు. అలాగే స్టార్ ఓపెనర్ షెఫాలీ వర్మకి తోడు స్మృతి మంధాన కూడా ఈ సిరీస్ బరిలోకి దిగుతున్నారు. శ్రీలంకతో జరిగే సిరీస్‌కు బిసిసిఐ ప్రకటించిన 15మంది ఆటగాళ్లను బిసిసిఐ మంగళవారం ప్రకటించింది. ఈనెల 21న విశాఖ వేదికగా జరిగే తొలి టి20తో ఐదు మ్యాచ్‌ల సిరీస్ ప్రారంభం కానుంది. కెప్టెన్‌గా హర్మన్ ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్‌గా స్మృతి మంధాన ఎంపికయ్యారు. అండర్-19లో భారతజట్టు తరపున ఆడిన జి. కమిలిని, వైష్ణవి శర్మలకు తొలిసారి జాతీయ జట్టులో చోటు దక్కింది. తొలి రెండు టి20లో విశాఖపట్నంలో జరగనున్నాయి. ఈ మ్యాచ్‌లు డిసెంబర్ 21, 23న జరుగుతాయి. చివరి మూడు టి20లు తిరువనంతపురంలో డిసెంబర్ 26, 28, 30న జరగనున్నాయి. 2026 ఐసిసి మహిళల టి20 ప్రపంచకప్‌కు ముందు భారత మహిళల జట్టుకు ఈ సిరీస్ సన్నాహకంగా సిద్ధమవుతుంది.

జట్టు: హర్మన్‌ప్రీత్(కెప్టెన్), మంధాన(వైస్ కెప్టెన్), దీప్తి శర్మ, స్నేహ్ రాణా, రోడ్రిగ్స్, షెఫాలీ వర్మ, హర్లిన్ డియోల్, అమన్‌జోత్ కౌర్, అరుంధతి రెడ్డి, క్రాంతి గాడ్, రేణుకా సింగ్ ఠాకూర్, రీచా ఘోష్, జి. కమిలిని(వికెట్ కీపర్లు), శ్రీచరణి, వైష్ణవి శర్మ.

## తొలి టి 20లో
# టీమిండియా ఘన విజయం

- ఆదుకున్న హార్దిక్
- మిస్టరీ స్పిన్నర్ వరుణ్ మాయ
- దక్షిణాఫ్రికా 74 పరుగులకే ఆలౌట్



**కటక్:** దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టి20లో టీమిండియా ఘన విజయం సాధించింది. భారతజట్టు నిర్దేశించిన 176పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో దక్షిణాఫ్రికా జట్టు 74పరుగులకే కుప్పకూలింది. దీంతో టీమిండియా 101 పరుగుల తేడాతో గెలిచి ఐదు టి20ల సిరీస్‌లో శుభారంభం చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారతజట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 175పరుగులు చేసింది. తొలుత హార్దిక్ పాండ్యా(59నాటౌట్) అర్ధసెంచరీకి తోడు, తిలక్ వర్మ, అక్షర్ పటేల్ బ్యాటింగ్‌లో రాణించారు. అనంతరం భారత బౌలర్లు ఆర్ష్‌దీప్, బుమ్రా, వరణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ రెండేసి వికెట్లకు తోడు హార్దిక్, దూబే ఒక్కో వికెట్లు పడగొట్టి దక్షిణాఫ్రికాను కట్టడి చేశారు. దక్షిణాఫ్రికా బ్యాటర్లలో బ్రెవీస్(22), స్టబ్స్(14), మార్‌క్రమ్(14), యాన్సెన్(12) మాత్రమే రెండంక్కెల స్కోర్ చేశారు. అంతకుముందు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా అర్ధసెంచరీకి తోడు హైదరాబాద్ స్టార్ బ్యాటర్ తిలక్ వర్మ, అక్షర్ పటేల్ రాణించడంతో దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టి20లో టీమిండియా భారీస్కోర్ నమోదు చేసింది. తొలుత శుభ్‌మన్ గిల్(4)ను ఎన్గిడి ఔట్ చేశాడు. ఆ తర్వాత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(12) యాన్సెన్ ఔట్ చేయడంతో భారతజట్టు 17 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో మరో ఓపెనర్ అభిషేక్ శర్మ(17), తిలక్ వర్మ(26) ఇన్నింగ్స్‌ను చక్క దిద్దారు. సిపమ్లా ఓవర్లో రెండు ఫోర్లు కొట్టిన అభిషేక్.. హ్యాట్రిక్ షాట్ మిస్సై ఔటయ్యాడు. ఆ తర్వాత యాన్సెన్ బౌండరీ వద్ద సూపర్ క్యాచ్ పట్టగా తిలక్ సైతం వెనుదిరిగాడు. చివర్లో హార్దిక్ పాండ్యా ఫోర్లు, సిక్సర్లతో ధనా ధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగి ఆడాడు. దక్షిణాఫ్రికా బౌలర్లు ఎన్గిడికి మూడు, సిపమ్లాకు రెండు, ఫెర్రెరాకు ఒక వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ హార్దిక్ పాండ్యాకు లభించగా.. రెండో టి20 ఛండీగర్ వేదికగా గురువారం(11న) జరగనుంది.

**పాండ్యా విధ్వంసం:** టీమిండియా 78 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న దశలో క్రీజులోకి వచ్చిన హార్దిక్ పాండ్యా(59 నాటౌట్) అర్ధసెంచరీతో మెరిసాడు. కేవలం 25బంతుల్లో 4సిక్సర్లు, 5ఫోర్ల సాయంతో అర్ధసెంచరీని పూర్తి చేశాడు. కేశవ్ మహరాజ్ ఓవర్లో రెండు భారీ సిక్సర్లు బాదిన హార్దిక్.. సిపమ్ల ఓవర్లో స్ట్రెయిట్ సిక్సర్‌తో స్కోర్‌బోర్డును 100పరుగులు దాటించాడు. చివర్లో జోరు పెంచిన పాండ్యా.. నోర్జి వేసిన 20వ ఓవర్లో సిక్సర్ కొట్టి అర్ధసెంచరీని పూర్తి చేశాడు. ఆ తర్వాత మరో ఫోర్ బాదడంతో టీమిండియా 6 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేయగలిగింది. ఈ మ్యాచ్‌లో నాలుగు సిక్సర్లు బాదిన పాండ్యా టీ20ల్లో వంద సిక్సర్ల క్లబ్‌లో చేరాడు.

**ఇండియా ఇన్నింగ్స్:** అభిషేక్ శర్మ (సి)యాన్సెన్ (బి)సిపమ్లా 17, శుభ్‌మన్ (సి)యాన్సెన్ (బి)ఎన్గిడి 4, సూర్యకుమార్ (సి)మార్‌క్రమ్ (బి)ఎన్గిడి 12, తిలక్ వర్మ (సి)యాన్సెన్ (బి)ఎన్గిడి 26, అక్షర్ (సి)ఫెర్రెరా (బి)సిపమ్లా 23, హార్దిక్ పాండ్యా (నాటౌట్) 59, దూబే (సి)ఫెర్రెరా 11, జితేశ్ వర్మ (నాటౌట్) 10, అదనం 13. (20ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 175పరుగులు.

**వికెట్ల పతనం:** 1/5, 2/17, 3/48, 4/78, 5/104, 6/137 బౌలింగ్: ఎన్గిడి 4-0-31-3, యాన్సెన్ 4-0-23-0, సిపమ్లా 4-0-38-2, నోర్జే 4-0-41-0, మహరాజ్ 2-0-25-0, ఫెర్రెరా 2-0-13-1.

**దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్:** డికాక్ (సి)అభిషేక్ (బి)ఆర్ష్‌దీప్ 0, మార్‌క్రమ్ (బి)అక్షర్ 14, స్టబ్స్ (సి)జితేశ్ శర్మ (బి)ఆర్ష్‌దీప్ 14, బ్రెవీస్ (సి)సూర్యకుమార్ (బి)బుమ్రా 22, డేవిడ్ మిల్లర్ (సి)జితేశ్ శర్మ (బి)హార్దిక్ 1, ఫెర్రెరా (సి)జితేశ్ శర్మ (బి)వరుణ్ చక్రవర్తి 5, యాన్సెన్ (బి)వరుణ్ చక్రవర్తి 12, మహరాజ్ (సి)జితేశ్ శర్మ (బి)బుమ్రా 0, నోర్జే (బి)అక్షర్ 1, సిపమ్లా (సి)అభిషేక్ శర్మ (బి)దూబే 2, ఎన్గిడి (నాటౌట్) 2, అదనం 1. (12.3ఓవర్లలో ఆలౌట్) 74పరుగులు.

వికెట్ల పతనం: 1/0, 2/16, 3/40, 4/45 5/50, 6/68, 7/68, 8/70, 9/70, 10/74 బౌలింగ్: ఆర్ష్‌దీప్ 2-0-14-2, బుమ్రా 3-0-17-2, వరుణ్ చక్రవర్తి 3-1-19-2, అక్షర్ పటేల్ 2-0-7-2, హార్దిక్ పాండ్యా 2-0-16-1, దూబే 0.3-0-1-1.

# రాష్ట్రమంత్రిపై బురదజల్లే కార్యక్రమాలు మానుకోవాలి

- వైసీపీ బీసీ నాయకుడుగా చలామణి అవుతున్న ఒక చీటర్ విజయభాస్కర్
- అలాంటి వ్యక్తికి వైసీపీ నాయకులు వంతపాడమా?
- టీడీపీ రాయచోటి పట్టణ అధ్యక్షుడు బోనమల ఖాదర్ వల్లి
- మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి
- మాజీ కౌన్సిలర్లు చెంగా ఈశ్వరయ్య
- బిఎంకె రషీద్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు కొట్టే చలపతి



**రాయచోటి–సూర్య వాస్తవం, డిసెంబర్ 9:** వైసీపీ బీసీ నాయకుడుగా చలామణి అవుతున్న విజయభాస్కర్ ఒక చీటర్ అని, అలాంటి వ్యక్తికి వైసిపి నాయకులు వంత పాడడం ఎంతవరకు సమంజసమని టీడీపీ రాయచోటి పట్టణ అధ్యక్షుడు బోనమల ఖాదర్ వల్లి, మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు చెంగా ఈశ్వరయ్య, బిఎంకె రషీద్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు కొట్టే చలపతిలు ప్రశ్నించారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని టిడిపి పట్టణ అధ్యక్షుడు బోనమల ఖాదర్ వల్లి తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ...రాయచోటిలో వైసీపీ బీసీ నాయకుడు విజయ భాస్కర్ పై జరిగిన దాడికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కి ఏమిటి సంబంధం అని వారు ప్రశ్నించారు. మంత్రి రాంప్రసాద్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి ని, ప్రజా ఆదరణను చూసి ఓర్వలేకనే మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అసత్య ఆరోపణలు చేస్తున్నారని వారు మండిపడ్డారు. మంత్రిపై ఇలాంటి బురదజల్లే కార్యక్రమంలో మానుకోవాలని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. విజయభాస్కర్ అనే ఒక చీటర్‌ను అడ్డం పెట్టుకొని రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. వైసిపి హయాంలో మహిళల కు, అమాయకులకు మాయమాటలు చెప్పి 50 లక్షలు వసూలు చేసిన మాయలోడు విజయభాస్కర్ అన్నారు. పేద మహిళలను టార్గెట్ గా చేసుకొని వారితో వ్యభిచారం చేయించిన నీచుడు విజయభాస్కర్ అన్నారు. బస్సు దొంగతనం కేసులో కూడా ఓ ముద్దాయిగా ఉన్నాడన్నారు. ఇలాంటి వ్యక్తి ని వైసీపీ నాయకులు బీసీ నాయకుడు అంటూ సిగ్గు శరం లేకుండాఏ విధంగా చెప్పుకుంటున్నారో వైసీపీ నాయకులే సమాధానం చెప్పాలన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కోసం తన అనుచరుడుని పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించిన దుర్మార్గుడన్నారు. దాడి ఘటనలో గాయపడ్డ వ్యక్తి ఒక్కరోజులోనే బాగు అయ్యి ఇంటికి వస్తాడా అంటూ వారు అనుమానం వ్యక్తం చేశారు. ఈ డ్రామా అంతా చూస్తుంటే తనంతకు తానే దాడి చేయించుకుని ఈ దాడి ఘటనను టిడిపికి, మంత్రి రాంప్రసాద్ రెడ్డికి అంటగట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. రాయ చోటిలో ఏదో ఒకలాగా రాజకీయ లబ్ధి పొందాలని మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. టిడిపిలోనే బీసీలకు సంబంధిత స్థానం ఉందని, బీసీల పార్టీ టిడిపి నేనన్నారు. మంత్రి రాంప్రసాద్ రెడ్డి రాయచోటి ప్రాంతంలోని బీసీలకు కొండంత అండగా ఉన్నారన్నారు. బీసీలకు మంత్రి రాంప్రసాద్ రెడ్డి అండగా నిలుస్తున్నాడన్న ఆక్రోషంతోనే వైసీపీ నాయకులు మంత్రి రాంప్రసాద్ రెడ్డి పై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. మంత్రి రాంప్రసాద్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ పై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు.

## రాయచోటి అభివృద్ధి పథాన్ని నూతన శకానికి తీసుకెళ్తున్న మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి





**అన్నమయ్య బ్యూరో– సూర్య వాస్తవం, డిసెంబర్ 9:** రాయచోటి అభివృద్ధికి మరో కీలక మైలురాయి నెలకొంది. సింబాల గ్రామంలో ఏర్పడుతున్న ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సూచనలతో ప్రభుత్వం మరో ముఖ్య నిర్ణయం తీసుకుంది. మంగళవారం సింబ్యాల గ్రామం పరిధిలోని 75 ఎకరాల భూమికి రైతులకు ఎకరాకు రూ.5,50,000 పరిహారం మంజూరు చేస్తున్నట్లు ఆర్డీవో, మండల రెవిన్యూ అధికారి అధికారికంగా ప్రకటించారు.ఇందుకు గ్రామంలోని రైతులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాయచోటి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ అనంపల్లి రాంప్రసాద్ రెడ్డి, సిబ్యాల గ్రామ రైతులు, యువత కలిసి ప్రభుత్వంపై తమ కృతజ్ఞతను వ్యక్తం చేశారు.ఇటీవల నవంబర్ 11, 2025 తేదీన రాష్ట్ర రవాణా, యోజన క్రీడాశాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సమక్షంలో సిబ్యాల గ్రామంలో ఏం ఎస్ ఎం ఇ పార్క్ భూమిపూజ ఘనంగా నిర్వహించిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన "ప్రతినియోజక వర్గంలో ఒక ఎంఎస్ఎంఇ పార్క్ –ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త" అనే లక్ష్యానికి ఇది బలమైన అడుగు కావడం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ప్రభుత్వం పట్ల తమ కృతజ్ఞతలు తెలియజేస్తూ, ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు కి, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , రాష్ట్ర అభివృద్ధి శిల్పి నారా లోకేష్ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కిప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఏం ఎస్ ఎం ఈ పార్క్ ఏర్పాటు ద్వారా స్థానిక యువతకు భారీగా ఉపాధి అవకాశాలు, రాయచోటి ప్రాంతానికి పారిశ్రామిక ప్రగతి, మరియు ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి దక్కుతుందనే విశ్వాసాన్ని ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. రాయచోటి నియోజకవర్గం అభివృద్ధి యాత్ర, కొత్త దిశగా ముందుకు సాగుతుందని ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేసారు.

## పిల్లల పోషణ, ఎదుగుదల, ఆరోగ్య ఫలితాలను మెరుగుపరచడంలో ఐసిడిఎస్ శాఖ పాత్ర కీలకం

### - జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్




**అన్నమయ్య బ్యూరో– సూర్య వాస్తవం, డిసెంబర్ 9:** పిల్లల పోషణ, ఎదుగుదల, ఆరోగ్య ఫలితాలను మెరుగుపరచడానికి ఐసిడిఎస్ శాఖ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని సిడిపిఓ, సూపర్వై జర్లను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని బాల సంజీవిని టి హెచ్ ఆర్ డిస్ట్రిబ్యూషన్, గ్రోత్ రిపోర్ట్ పోషన్ ట్రాకర్, పి ఈఎస్ హాజరు, బిఎస్ కిట్, తదితర అంశాలపై సిడిపిఓలు, సూపర్వై జర్లతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సమావేశాల్లో ఎక్కువ శాతం విద్యా, ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమ శాఖకు ఎక్కువ శాతం బడ్జెట్ కేటాయించడం జరుగుతోందన్నారు. ఈ అంశాన్ని బట్టి ప్రభుత్వాలు స్త్రీ శిశు సంక్షేమ శాఖకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందో తెలుసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ స్త్రీలకు, పాలిచ్చే తల్లులకు ఎన్నో వేల కోట్ల రూపాయలతో పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలు అందజేయడం జరుగుతుంద న్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు అందించే ఆహారం వల్ల దేశ అభివృద్ధికి ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఐసిడిఎస్ సిబ్బంది కిట్స్ పంపిణీ చేయడం మాత్రమే కాకుండా ఫలితాల ఆధారిత పనితీరుపై దృష్టి సారించాలని కిట్స్ పంపిణీ తర్వాతహిమోగ్లోబిన్ పెరిగిందా లేదా, హైట్ గ్రోత్,వెయిట్ గ్రోత్ వచ్చాయా లేదా అనే విషయాన్ని గమనించి వారికి కావాల్సిన సలహాలు సూచనలు అందివ్వాలని అన్నారు. గర్భిణీలలో హిమోగ్లోబిన్ తగ్గుద లలో పీలేరు, బొమ్మను చెరువు, వైకోట, కలకడ కేంద్రాలలో ఎక్కువగా ఉన్నాయని పురోగతి సాధించాలని అన్నారు. ఈ అంశంపై ఐసిడిఎస్‌పిడి ప్రతిరోజు మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. అండర్ వెయిట్ లో వాల్మీకిపురం చిట్వేల్ బి కొత్తకోట తదితర ప్రాంతాలు వెనుకబడి ఉన్నాయని వాటిలో పురోగతి సాధించాలని అన్నారు. రాష్ట్రంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్య క్రమాలు అన్నింటిలో మెరుగైన ఫలితాలు సాధించి, మెరుగైన స్థానాన్ని సాధిం చేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ పిడి హైమవతి, జిల్లాలోని సిడిపిఓలు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారానికే కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది



**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం, డిసెంబర్ 9 :** ప్రజా సమస్యలు పరిష్కారం కోసమే కూటమి ప్రభుత్వం పని చేస్తుందని మండల టిడిపి అధ్యక్షుడు యనమల మదన్మోహన్ పేర్కొన్నారు. పల్లెబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం దిన్నెపాడు పంచాయతీలోని నరసింహ రాజుగారి పల్లి, పర్వతరెడ్డి గారి పల్లి, బెస్తపల్లి దిన్నెపాడు గ్రామాలలో పర్యటించి ప్రజా సమస్యలపై ఆరా దీశారు. ఈ సందర్భంగా బెస్తపల్లి హరిజనవాడలో వీది లైట్లు సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని ప్రజలు వినతలను సమర్పించారు.ఈ సందర్భంగా మదనమోహన్ మాట్లాడుతూ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే సిసి రోడ్లు వీధిలైట్లు త్రాగునీటి సమస్య రోడ్లు ఏర్పాటు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల క్లస్టర్ కన్వీనర్ శంకరపు జయరాం లకిరెడ్డిపల్లి సింగల్ విండో అధ్యక్షుడు వీరబల్లి లక్ష్మీరాజు మోహన్ రెడ్డి దళిత ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులేసు టిడిపి నాయకులు ఓబులేసు సంజీవరాజు వెంకటరమణ హనుమంతు రామాంజనేయులు గంగరాజు సురేంద్ర రాజు వీరయ్య సీఎం రాజు వెంకటరామరాజు సింగిల్ బిల్డ్ అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి సర్పంచ్ లక్ష్మీనారాయణ బాల రెడ్డి యాదవ్ కొండల తెలుగు యువత ప్రెసిడెంట్ పకీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైయస్ భారతి రెడ్డి జన్మదిన వేడుకలు కేక్ కట్ చేసిన వైఎస్ మనోహర్ రెడ్డి



**పులివెందుల –సూర్య వాస్తవం, డిసెంబర్ 9 :** పులివెందుల పట్టణం లోని జగన్ క్యాంపు కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సతీమణి వైయస్ భారతి రెడ్డి 49వ జన్మదిన వేడుకలను వైకాపా నాయకుడు పద్మనాభరెడ్డి, కౌన్సిలర్ లక్ష్మీ ప్రసన్న ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కేకును మున్సిపల్ వైకాపా ఇన్చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ చైర్మన్ చిన్నప్ప, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, పట్టాను ఉపాధ్యక్షుడు కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్, మాజీ చైర్మన్ రుక్మిణి దేవి, మాజీ చైర్మన్ రసూల్, సాంబశివారెడ్డి, దేరంగుల చంద్రమౌళిల ఆధ్వర్యంలో కేక్ ను కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైయస్ భారతిరెడ్డి నిండు నూరేళ్లు, ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు వారు ఆకాంక్షించారు. వైయస్ భారతి రెడ్డి పేద పిల్లలు చదువుకోవాలనే దృఢ సంకల్పంతో ప్రత్యేక పాఠశాలలు నిర్మించడం జరిగిందన్నారు. ఆ పాఠశాలలో వందల మంది పిల్లలు చదువుకోవడం జరుగుతుందన్నారు. బుద్ధిమాన్యులు కోసం ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేసి వారిని కంటికి రెప్పలా కాపాడుకోవడం జరుగుతుందన్నారు. ఇటు ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాను, లో వందల మందికి ఉద్యోగ అవకాశం కల్పించడం జరిగిందన్నారు. భారతి సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మించి వేల మందికి జీవనోపాధి కల్పించడం జరుగుతుందన్నారు. అలాంటి గొప్ప మనిషి వైఎస్ భారతి రెడ్డి ఇలాంటి పుట్టినరోజులు ఎన్నో జరుపుకోవాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ హాఫీజ్, కో ఆప్షన్ నెంబర్ దాసరి చంద్రమౌళి, సోపాల వీర, చెన్నూరు కార్తీక్, గంగిరెడ్డి, సంపత్, కోళ్ల భాస్కర్, శ్రీరాములు, తదితర వైకాపా నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు



**కదిరి – సూర్య వాస్తవం, డిసెంబర్ 9 :** మాజీ జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు మంగళవారం మైనార్టీ సెల్ అధ్యక్షులు కుదాబక్ష అష్రఫ్ ఆధ్వర్యంలో, ఆయన నివాసం లోని కార్యాలయంలో కేక్ కట్ చేసి కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తల కు పంచిపెట్టారు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కే ఇందాదుల్లా ఖాన్ మాట్లాడుతూ మాజీ పీసీసీ చైర్పర్సన్ సోనియా గాంధీ ఇటలీకి చెందినవారు అని పదేపదే చెక్కభజనలు చేస్తున్న బిజెపి నాయకులకు సవాల్ విసిరారు, ఇటలీ నుండి వచ్చిన సోనియాగాంధీ దేశం కోసం భర్త ప్రాణాలను సైతం త్యాగం చేసిన ఘనత ఆమెకే చెందుతుందని కొనియాడారు, బిజెపి పరిపాలనలో ప్రజలపై భారాన్ని నెట్టుతూ జిఎస్టిని ప్రవేశపెట్టి మధ్యతరగతి కుటుంబాలకు నడ్డి విరిగేలా సంస్కరణలను ప్రవేశపెట్టిన చరిత్ర మోడీ ప్రభుత్వం కాదా అని విమర్శించారు, బిజెపి నాయకులకు దమ్ము ధైర్యం ఉంటే ఈవీఎంలు రద్దుచేసి బ్యాలెట్ పేపర్లను వచ్చే ఎన్నికలలో పెట్టాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో మాజీ పీసీసీ ప్రధాన కార్యదర్శి పి ఎస్ అహ్మద్ ,ఎస్ దామోదర్,, జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఖుదా బక్షు అష్రఫ్, చిలమత్తూరు మోహన్ గాంధీ, మొఘల్ అక్షర్ బేగ్, బాబా ఫక్రుద్దీన్,, ఇర్ఫాన్, రామకృష్ణారెడ్డి, శుద్ధపల్లి సులేమాన్, దేరంగుల ఈశ్వరప్ప, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )